జర్నలిస్ట్ డైరీ

తెలుగు దినపత్రిక



సంపుటి :13 | సంచిక :69 | శుక్రవారం | 13-11-2026 | పేజీలు:8 | వెల:రు 3/-

https://www.epaperjournalistdiary.com/

పాక్‌లో ఉగ్రవాదుల భీకర దాడి.


- పోలీసు కాన్వాయ్‌ను లక్ష్యంగా చేసుకుని మెరుపుదాడి
- ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లో ఘటన
- ఎదురుకాల్పుల్లో 18 మంది ఉగ్రవాదులు హతం
- మరో 12 మంది పోలీసులకు తీవ్ర గాయాలు
- కోహట్ జిల్లాలోని గుంబత్ ప్రాంతంలో దాడి
- అక్రమ బంగారు తవ్వకాల వ్యతిరేక ఆపరేషన్ ముగించుకుని వస్తుండగా దాడి
- దాడికి బాధ్యత ప్రకటించుకున్న టీటీపీ
- ఉగ్రవాదంపై పోరాటం కొనసాగుతుందని పాక్ ప్రభుత్వం స్పష్టీకరణ



ఎలాంటి ముప్పునైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి

- యుద్ధాల తీరు మారుతోంది.. కొత్త సవాళ్లకు సిద్ధం కావాలి
- సైన్యానికి రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పిలుపు
- ఆకస్మిక దాడులు నిర్వహించే సామర్థ్యాలను పెంచుకోవాలని సూచన
- నిఘా, పర్యవేక్షణ వ్యవస్థలను బలోపేతం చేయాలని ఆదేశం
- డ్రోన్లు, ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థల ప్రాధాన్యతపై ప్రస్తావన
- సైబర్, అంతరిక్ష యుద్ధాలపై ప్రత్యేక వ్యూహాలు రూపొందించాలని సూచన






తెలంగాణలో భారీగా ఐపీఎస్ అధికారుల బదిలీ

- రాష్ట్రవ్యాప్తంగా 21 మంది ఐపీఎస్‌ల బదిలీ
- హైదరాబాద్ కొత్త పోలీస్ కమిషనర్‌గా మహేశ్ భగవత్
- ఫైర్ సర్వీసెస్ డీజీగా వీసీ సజ్జనార్‌కు బాధ్యతలు
- లా అండ్ ఆర్డర్ అదనపు డీజీపీగా అకున్ సబర్వాల్
- మహిళా భద్రత విభాగం డీజీపీగా సౌమ్య మిశ్రా
- జైళ్ల శాఖ డీజీగా స్వాతి లక్రా నియామకం
- ఏసీబీ డీజీగా చారు సిన్హా.. సీఐడీ బాధ్యతలూ అప్పగింత
- టీజీఎస్ఆర్టీసీ ఎండీగా డా. అనిల్ కుమార్
- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు ఉత్తర్వులు జారీ

హైదరాబాద్

తెలంగాణ పోలీస్ శాఖలో ప్రభుత్వం భారీగా ఐపీఎస్ అధికారుల బదిలీలు చేపట్టింది. రాష్ట్రవ్యాప్తంగా 21 మంది అధికారులకు కొత్త బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. లా అండ్ ఆర్డర్, ఏసీబీ, సీఐడీ, మహిళా భద్రత, ట్రాఫిక్, ఇతర కీలక విభాగాల్లో మార్పులు చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జీఓ ఆర్టీ నంబర్ 1654ను విడుదల చేశారు. ఇప్పటివరకు డీజీపీ (లా అండ్ ఆర్డర్)గా ఉన్న మహేశ్ మురళీధర్ భగవత్‌ను హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్‌గా -మిగతా 2 లో



కీలక ఖనిజాల వేటలో భారత్ దూకుడు..

- కీలక ఖనిజాల కోసం 15 అంతర్జాతీయ ఒప్పందాలు చేసుకున్న భారత్
- 41 ఒప్పందాలతో అగ్రస్థానంలో కొనసాగుతున్న అమెరికా
- చైనా, కెనడా, ఈయూ కంటే వేగంగా భారత్ ముందడుగు
- నేషనల్ క్రిటికల్ మినరల్ మిషన్‌తో పటిష్ఠమైన చర్యలు
- అర్జెంటీనా, ఆస్ట్రేలియాలతో లిథియం తవ్వకాలకు భాగస్వామ్యం



స్వచ్ఛ నగరాల్లో నవీ ముంబైకి అగ్ర స్థానం

జూన్ 2 నాటికి టిమ్స్‌లు కంప్లీట్

ప్రజలకు పూర్తిస్థాయి సేవలందించాలి

- ఏడాదిలో ఉస్మానియా కొత్త భవనాలు ప్రజలకు అందాలి
- 3 టిమ్స్‌లకు ఏకీకృత నియామకాలు
- నిమ్స్... టిమ్స్‌ల మధ్య సమన్వయం ఉండాలి
- వైద్యులు, సిబ్బంది నియామక ప్రక్రియ వేగవంతం చేయండి
- వైద్య, ఆరోగ్య శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



జూన్ 2 నాటికి అల్వాల్, ఎల్‌బీనగర్ టిమ్స్‌లు, వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, నిమ్స్ విస్తరణ పనులు పూర్తి చేసి ప్రజలకు పూర్తిస్థాయి వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. వచ్చే ఏడాది డిసెంబరు నాటికి నూతన ఉస్మానియా ఆసుపత్రిని కూడా అందుబాటులోకి తేవాలని స్పష్టం చేశారు. ఆసుపత్రుల నిర్మాణం, వైద్య పరికరాల కొనుగోలు, వైద్యులు, సిబ్బంది నియామకాలను సమాంతరంగా వేగవంతం చేయాలని సూచించారు. మూడు టిమ్స్‌లలో ఏకీకృత నియామక విధానం అమలు చేయడంతోపాటు నిమ్స్, టిమ్స్‌ల మధ్య సమన్వయం పెంచాలని ఆదేశించారు. వైద్యారోగ్య శాఖపై నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షలో సీఎం ఈ కీలక నిర్ణయాలు వెల్లడించారు.

బీజేపీ, ఆరెస్సెస్ విదేశీ అంటూ నా తల్లిని విమర్శించాయి :

- విదేశీయురాలంటూ ఏళ్ల తరబడి విమర్శలు గుప్పించారని ప్రియాంక ఆవేదన
- తన జీవిత వాస్తవాలను పుస్తకంలో వెల్లడించే హక్కు సోనియాకు ఉందని స్పష్టీకరణ
- ఇన్నాళ్లూ విమర్శలకు స్పందించకుండా సోనియా మౌనంగా ఉన్నారని వెల్లడి
- 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' ద్వారా వాస్తవాలను ప్రజల ముందుంచారని వ్యాఖ్య
- గతంలో అబద్ధాలు ప్రచారం చేసినవారే ఇప్పుడు ఆ పుస్తకాన్ని చదువుతున్నారని ఎద్దేవా





ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన ఏపీ పెవిలియన్

- ఏపీ పెవిలియన్‌ను సందర్శించిన కేంద్ర మంత్రి పీయూష్ గోయల్
- కేంద్రమంత్రికి రాష్ట్ర అభివృద్ధి ప్రణాళికలు వివరించిన సీఎం చంద్రబాబు
- సీఎం, డిప్యూటీ సీఎం పవన్‌తో కలిసి పెవిలియన్‌ను పరిశీలించిన గోయల్
- రాష్ట్ర కళలు, సంస్కృతిని ప్రతిబింబించే స్టాళ్లను ఆసక్తిగా తిలకించిన నేతలు
- అరకు కాఫీని కలిసి ఆస్వాదించిన పీయూష్, చంద్రబాబు, పవన్ కల్యాణ్

అమరావతి, ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :

ఆంధ్రప్రదేశ్ సమగ్రాభివృద్ధి ప్రణాళికలు, సాంస్కృతిక వైభవాన్ని ప్రతిబింబించేలా ఏర్పాటు చేసిన ఏపీ పెవిలియన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్, ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌తో కలిసి ఈ పెవిలియన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను అధికారులు వారికి వివరించారు.

ఎకనమిక్ రీజియన్లలో ప్రగతిపై అధికారులు డిజిటల్ ప్రజెంటేషన్

ముఖ్యంగా, తిరుపతి, విశాఖపట్టణం, అమరావతి ఎకనమిక్ రీజియన్లలో జరుగుతున్న ప్రగతిపై అధికారులు డిజిటల్ ప్రజెంటేషన్ ద్వారా తెలియజేశారు. సీఆర్డీఏ పరిధిలో -మిగతా 2 లో

తన కొడుకుని అరెస్ట్ చేయవద్దంటూ ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ మహిళా పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నం :

జర్నలిస్ట్ డైరీ ఎల్బీనగర్..

ఆటో డ్రైవర్‌పై కత్తితో దాడి చేసి తప్పించుకుని తిరుగుతున్న వ్యక్తిని ఎల్బీనగర్ పోలీసులు గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు చేరుకున్నారు. ఎల్బీనగర్ పోలీస్ లు తెలిపిన వివరాల ప్రకారం.. ఆగస్టు 19వ తేదీన సంతోష నగర్ ఒవైసీ హాస్పిటల్ పక్కన నివాసం ఉండే ఎండీ. ఇమ్రోజ్ క్యాబ్ డ్రైవర్గా పనిచేస్తున్నాడు. ఆగస్టు 19 వతేదీన తెల్లవారు జామున 2:30 గంటలకు పహాడీషరీఫ్‌కు చెందిన తన స్నేహితుడు రహ్మత్ కలిసి ఒవైసీ హాస్పిటల్ పారి నుండి ఎల్బీనగర్ చౌరస్తాకు వెళ్తుండగా ఎల్బీనగర్ బస్ స్టాప్ వైపు యు-టర్న్ తీసుకుంటున్న సమయంలో ఆటోలో వచ్చిన నలుగురు గుర్తు తెలియని వక్తులు వచ్చిన వారు ఆకారణంగా రహ్మత్‌పై కత్తితో దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న ఎల్బీనగర్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ మేరకు పోలీసులు కత్తితో దాడి చేసి తప్పించుకుని తిరుగుతున్న నవీన్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించేందుకు ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.... కొడుకును అరెస్టు చేయొద్దు అంటూ.. ఎల్బీనగర్ పీఎస్‌లో పెట్రోల్ పోసుకుని మహిళ ఆత్మహత్యాయత్నం..

ఆటో డ్రైవర్‌పై కత్తితో దాడి చేసిన కేసులో



నవీన్‌ను అరెస్టు చేసిన విషయం తెలుసుకున్న నందనవనంకు చెందిన నవీను వాళ్ల అమ్మ సునీత వారి కుటుంబ సభ్యులతో ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్‌కు గురువారం మధ్యాహ్నం వచ్చింది. ఆమె అక్కడ పోలీసులను చూసి పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆందోళనకు దిగింది. దాడికి వారి అందరినీ అరెస్టు చేయడానికి తన కుమారుడి ఒక్కడినే ఎలా అరెస్టు చేస్తారంటూ పోలీసులతో చూషణకు దిగింది. తన కుమారుడిని అరెస్టు చేయవద్దంటూ పోలీస్ స్టేషన్ ఆవరణలో హంగామా సృష్టించింది. తను ఇక్కడే చనిపోతానని చెప్పి బయటకు వెళ్లి బాటిల్లో పెట్రోల్ తెచ్చుకుంది. స్టేషన్ వచ్చి తన కుమారుడిని బయటకు పంపించాలని డిమాండ్ చేస్తూ తన వెంట తెచ్చుకున్న పెట్రోల్ ను ఇంటిపై పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. అక్కడే విధుల్లో ఉన్న పోలీసులు అప్రమత్తమయ్యారు. ఆమె వద్ద ఉన్న పెట్రోల్ బాటిల్ను స్వాధీనం చేసుకున్న మహిళకు ఎలాంటి ప్రమాదం జరగకుండా చర్యలు తీసుకున్నారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉన్న నీళ్లు ఆమె పోసి పెట్రోల్ అనవాళ్లు లేకుండా చేశారు. అక్కడ ఉన్న పోలీసులు సమయస్ఫూర్తితో మహిళకు ఎలాంటి ప్రమాదం జరగకుండా చర్యలు తీసుకున్నారు. ఈ సంఘటనతో పోలీస్ స్టేషన్ ఆవరణలో ఒక్కసారిగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ విషయం తెలుసుకున్న ఎల్బీనగర్ ఇన్స్పెక్టర్ వెంకటేశం అక్కడకు వచ్చి సంఘటన సునీతతో మాట్లాడాడు. సమస్యను పెద్దది కాకుండా చూసి ఆమెను ఆసుపత్రికి తరలించాలని సూచించాడు. మద్యం మత్తులో సునీత హంగామా సృష్టించాడు. అనంతరం సునీతను అంబులెన్స్ హాస్పిటల్ తరలించారు..



స్థానిక ఎన్నికల్లో ఓటములపై లోకేశ్ సమీక్ష..

- 4 అంశాలపై నివేదికలకు ఆదేశం!
- స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ఓటములపై నారా లోకేశ్ దృష్టి
- నాలుగు అంశాల ఆధారంగా కారణాలను తెలియజేయాలని పార్టీ నేతలకు సూచన
- క్యాడర్ అభిప్రాయాలకు విరుద్ధంగా అభ్యర్థుల ఎంపికతో ఓడిన స్థానాలేంటో గుర్తించాలన్న మంత్రి
- ఎమ్మెల్యేల పనితీరు, కూటమి సమన్వయ లోపం, వైసీపీ సంస్థాగత బలంపైనా నివేదిక కోరిన లోకేశ్
- 76 జడ్పీటీసీ, 1,700 ఎంపీటీసీ స్థానాల్లో ఓటమికి కారణాలను విశ్లేషించాలని సూచన



ప్రెస్ రిలీజ్‌ల కాలం పోయింది.. ఇప్పుడంతా ఇన్‌స్టా రీల్స్..!

పాక్‌లో ఉగ్రవాదుల భీకర దాడి.


- పోలీసు కాన్వాయ్‌ను లక్ష్యంగా చేసుకుని మెరుపుదాడి
- ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లో ఘటన
- ఎదురుకాల్పుల్లో 18 మంది ఉగ్రవాదులు హతం
- మరో 12 మంది పోలీసులకు తీవ్ర గాయాలు
- కోహట్ జిల్లాలోని గుంబత్ ప్రాంతంలో దాడి
- అక్రమ బంగారు తవ్వకాల వ్యతిరేక ఆపరేషన్ ముగించుకుని వస్తుండగా దాడి
- దాడికి బాధ్యత ప్రకటించుకున్న టీటీపీ
- ఉగ్రవాదంపై పోరాటం కొనసాగుతుందని పాక్ ప్రభుత్వం స్పష్టీకరణ



ఇస్లామాబాద్:
పాకిస్థాన్‌లో మరోసారి ఉగ్రవాదులు రెచ్చిపోయారు. దేశ వాయవ్య ప్రాంతంలోని ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లో పోలీసు కాన్వాయ్‌ను లక్ష్యంగా చేసుకుని భీకర దాడికి పాల్పడ్డారు. ఈ ఘటనలో 10 మంది పోలీసులు ప్రాణాలు కోల్పోగా, ఎదురుకాల్పుల్లో 18 మంది ఉగ్రవాదులు హతమైనట్లు ప్రావిన్షియల్ అధికారులు వెల్లడించారు. మరో 12 మంది పోలీసు సిబ్బంది తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనతో ఆ ప్రాంతంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. కోహట్ జిల్లాలోని గుంబత్ ప్రాంతంలో అక్రమ బంగారు తవ్వకాలకు వ్యతిరేకంగా చేపట్టిన ఆపరేషన్‌ను ముగించుకుని పోలీసులు తిరిగి వస్తుండగా ఈ దాడి జరిగింది. పోలీసు కాన్వాయ్ ప్రయాణిస్తున్న సమయంలో ఉగ్రవాదులు ఒక్కసారిగా కాల్పులు ప్రారంభించినట్లు ఖైబర్ పఖ్తుంఖ్వా పోలీసులు తమ ప్రకటనలో పేర్కొన్నారు. ముందస్తు ప్రణాళికతోనే కాన్వాయ్‌ను లక్ష్యంగా చేసుకుని దాడి చేసినట్లు తెలుస్తోంది. కాల్పుల అనంతరం ఉగ్రవాదులు రెండు పోలీసు వాహనాలకు నిప్పు పెట్టారు. మరో రెండు పోలీసు వాహనాలతోపాటు ఒక ప్రైవేటు వాహనం గల్లంతైనట్లు అధికారులు వెల్లడించారు. ఈ దాడికి తామే బాధ్యులమని నిషేధిత ఉగ్రవాద సంస్థ తెహ్రీక్-ఏ-తాలిబన్ పాకిస్థాన్ (టీటీపీ) ప్రకటించుకుంది. ఇదిలా ఉండగా, కోహట్ జిల్లాలోని ఒరక్‌జాయ్ ప్రాంతంలో భద్రతా దళాలు మరో ఆపరేషన్ నిర్వహించాయి. ఈ చర్యలో 10 మంది టీటీపీ ఉగ్రవాదులను హతమార్చినట్లు అధికారులు తెలిపారు. వారి వద్ద నుంచి భారీగా ఆయుధాలు, పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. పోలీసు కాన్వాయ్‌పై జరిగిన దాడిని పాకిస్థాన్ అధ్యక్షుడు ఆసిఫ్ అలీ జర్దారీ, విదేశాంగ మంత్రి ఇషాక్ దార్ తీవ్రంగా ఖండించారు. ఉగ్రవాదుల దాడులకు భయపడేది లేదని, దేశంలో ఉగ్రవాదంపై పోరాటం నిరంతరం కొనసాగుతుందని స్పష్టం చేశారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసుల త్యాగం వృథా కాదని పేర్కొన్నారు. దేశంలో శాంతిభద్రతలను కాపాడేందుకు, ఉగ్రవాదాన్ని అంతమొందించే వరకు భద్రతా దళాల చర్యలు కొనసాగుతాయని ప్రభుత్వ పెద్దలు స్పష్టం చేశారు.

తెలంగాణలో భారీగా ఐపీఎస్
అధికారుల బదిలీ


(మొదటి తరువాయి)



నియమించారు. ఇప్పటివరకు హైదరాబాద్ సీపీగా పనిచేసిన వీసీ సజ్జనార్‌ను తెలంగాణ ఫైర్, డిజాస్టర్ రెస్పాన్స్, ఎమర్జెన్సీ అండ్ సివిల్ డిఫెన్స్ విభాగం డీజీగా బదిలీ చేశారు. అదనంగా స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (ఎస్‌పీఎఫ్) డీజీ బాధ్యతలు కూడా అప్పగించారు. రాష్ట్ర శాంతిభద్రతల అదనపు డీజీపీగా అకున్ సబర్వాల్‌ను నియమించడంతోపాటు కోఆర్డినేషన్, టెక్నికల్ సర్వీసెస్ బాధ్యతలు కేటాయించారు. డా. సౌమ్య మిశ్రాకు మహిళా భద్రత, షీ టీమ్స్, భరోసా విభాగాల డీజీపీ బాధ్యతలు అప్పగించారు. స్వాతి లక్రాను జైళ్ల శాఖ డీజీగా నియమించి, హోంగార్డ్స్ డీజీపీగా అదనపు బాధ్యతలు ఇచ్చారు. చారు సిన్హాకు ఏసీబీ డీజీతోపాటు సీఐడీ డీజీపీ బాధ్యతలు కేటాయించారు. డా. అనిల్ కుమార్‌ను టీజీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్‌గా నియమించారు. మిగతా అధికారులకు కూడా వివిధ విభాగాలు, జోన్లలో కొత్త పోస్టింగ్‌లు ఇచ్చారు.

కీలక ఖనిజాల వేటలో భారత్ దూకుడు..

- కీలక ఖనిజాల కోసం 15 అంతర్జాతీయ ఒప్పందాలు చేసుకున్న భారత్
- 41 ఒప్పందాలతో అగ్రస్థానంలో కొనసాగుతున్న అమెరికా
- చైనా, కెనడా, ఈయూ కంటే వేగంగా భారత్ ముందడుగు
- నేషనల్ క్రిటికల్ మినరల్ మిషన్‌తో పటిష్ఠమైన చర్యలు
- అర్జెంటీనా, ఆస్ట్రేలియాలతో లిథియం తవ్వకాలకు భాగస్వామ్యం



కీలక ఖనిజాల సేకరణలో భారత్ అంతర్జాతీయంగా దూసుకెళ్తోంది. 2025 జనవరి నుంచి ఇప్పటివరకు 15 క్రిటికల్ మినరల్స్ ఒప్పందాలు చేసుకుని ప్రపంచంలో రెండో స్థానంలో నిలిచింది. క్లైమేట్ యాక్షన్ లైవ్ నివేదిక ప్రకారం.. 41 ఒప్పందాలతో అమెరికా మొదటి స్థానంలో ఉండగా, చైనా, కెనడా, సౌదీ అరేబియా, యూరోపియన్ యూనియన్ వంటి దేశాలు 11 ఒప్పందాలతో భారత్ కంటే వెనుకబడ్డాయి. ఎలక్ట్రిక్ వాహనాలు, బ్యాటరీలు, సెమీకండక్టర్లు, విండ్ టర్బైన్ల తయారీకి అవసరమైన లిథియం, కోబాల్ట్, నికెల్, గ్రాఫైట్, రాగి వంటి ఖనిజాల కోసం భారత్ విదేశీ భాగస్వామ్యాలను పెంచుకుంటోంది. ఇందులో భాగంగా కేంద్రం నేషనల్ క్రిటికల్ మినరల్ మిషన్‌ను ప్రారంభించింది. 2030-31 వరకు ఈ కార్యక్రమానికి రూ.16,300 కోట్లు కేటాయించగా, ప్రభుత్వ రంగ సంస్థలు మరో రూ.18,000 కోట్లు పెట్టుబడి పెట్టనున్నాయి. అర్జెంటీనాలోని ఐదు లిథియం బ్లాకుల అన్వేషణతోపాటు ఆస్ట్రేలియాలో లిథియం, కోబాల్ట్ ఆస్తులపై భారత్ దృష్టి సారించింది. జర్మనీ, నార్వేలతో ఖనిజాల ప్రాసెసింగ్, రీసైక్లింగ్ రంగాల్లో సహకారాన్ని విస్తరిస్తోంది.

స్వచ్ఛ నగరాల్లో నవీ ముంబైకి అగ్ర స్థానం

న్యూఢిల్లీ
దేశంలోనే అత్యంత పరిశుభ్రమైన నగరంగా నవీ ముంబై ఘనత సాధించింది. వరుసగా ఎనిమిదేండ్లు అగ్రస్థానంలో నిలిచిన ఇండోర్‌ను ఈసారి వేరే విభాగంలో చేర్చారు. తాజా స్వచ్ఛ సర్వేక్షణ్ 2025-26లో సూరత్, విజయవాడ వరుసగా రెండో, మూడో స్థానాలు దక్కించుకున్నాయి.మధ్యప్రదేశ్ లోని రేవాను అత్యంత పరిశుభ్రమైన నదీతీర పట్టణంగా, రుద్రపూర్‌ను అత్యంత పరిశుభ్రమైన హిమాలయ నగరంగా ఎంపిక చేశారు. 10 లక్షలకు పైగా జనాభా ఉన్న నగరాల విభాగంలో గ్రేటర్ విశాఖపట్నం అగ్రస్థానంలో నిలిచింది.

ఎలాంటి ముప్పునైనా ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలి

- యుద్ధాల తీరు మారుతోంది.. కొత్త సవాళ్లకు సిద్ధం కావాలి
- సైన్యానికి రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పిలుపు
- ఆకస్మిక దాడులు నిర్వహించే సామర్థ్యాలను పెంచుకోవాలని సూచన
- నిఘా, పర్యవేక్షణ వ్యవస్థలను బలోపేతం చేయాలని ఆదేశం
- డ్రోన్లు, ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థల ప్రాధాన్యతపై ప్రస్తావన
- సైబర్, అంతరిక్ష యుద్ధాలపై ప్రత్యేక వ్యూహాలు రూపొందించాలని సూచన



న్యూఢిల్లీ: యుద్ధాల స్వరూపం వేగంగా మారుతున్న నేపథ్యంలో ఎలాంటి రూపంలో ముప్పు ఎదురైనా సమర్థంగా తిప్పికొట్టేందుకు సర్వసన్నద్ధంగా ఉండాలని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ సైన్యానికి పిలుపునిచ్చారు. అవసరమైనప్పుడు ఆకస్మిక దాడులు నిర్వహించే సామర్థ్యాలను కూడా పెంపొందించుకోవాలని సూచించారు. ఢిల్లీలో నిర్వహించిన వైమానిక దళ కమాండర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. మారుతున్న యుద్ధ పరిస్థితులకు అనుగుణంగా రక్షణ, ప్రతిదాడుల వ్యూహాలను ఆధునికీకరించుకోవాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశారు. శత్రువుల కదలికలను ముందుగానే గుర్తించేలా నిఘా, పర్యవేక్షణ సామర్థ్యాలను నిరంతరం పెంచుకోవాలని రాజ్‌నాథ్ సింగ్ సూచించారు. ముప్పును ముందే పసిగట్టి నష్టం జరగకుండా అప్రమత్తంగా వ్యవహరించాలని అన్నారు. శత్రువులు ఆకస్మికంగా దాడులకు దిగినా వారి వ్యూహాలకు చిక్కకుండా ముందస్తు సన్నద్ధతతో ఉండాలని పేర్కొన్నారు. మన సైనిక చర్యలు శత్రువుల అంచనాలకు అందని విధంగా ఉండాలని, వారు కోలుకునే అవకాశం ఇవ్వని సామర్థ్యాలను రక్షణ దళాలు అభివృద్ధి చేసుకోవాలని దిశానిర్దేశం చేశారు. ఆధునిక యుద్ధాల్లో చోటుచేసుకుంటున్న మార్పులను వివరిస్తూ ఉక్రెయిన్-రష్యా, ఇజ్రాయెల్-హమాస్ ఘర్షణలను ఆయన ప్రస్తావించారు. ప్రస్తుత యుద్ధాల్లో సంప్రదాయ ఆయుధాలతోపాటు డ్రోన్లు, ఎయిర్ డిఫెన్స్ వ్యవస్థలు కీలక పాత్ర పోషిస్తున్నాయని పేర్కొన్నారు. ముఖ్యంగా ఆత్మాహుతి డ్రోన్లు, నిఘా డ్రోన్ల వినియోగం వల్ల భద్రతా దళాలకు కొత్త సవాళ్లు ఎదురవుతున్నాయని తెలిపారు. వాటిని గుర్తించి అడ్డుకునే సాంకేతిక పరిజ్ఞానం, ప్రతిస్పందన సామర్థ్యాలను పెంచుకోవాలని సూచించారు. గూఢచార, నిఘా వ్యవస్థలను మరింత పటిష్టం చేసుకోవాల్సిన అవసరం ఉందని రక్షణ మంత్రి అన్నారు. శత్రువుల కదలికలు, వ్యూహాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించే వ్యవస్థలు అందుబాటులో ఉండాలని పేర్కొన్నారు. ఎలాంటి పరిస్థితులు ఎదురైనా తక్షణమే స్పందించేలా సైనిక విభాగాల మధ్య సమన్వయం పెంచుకోవాలని సూచించారు. సైబర్ యుద్ధాలు, అంతరిక్ష రంగంలో ఆయుధాల మోహరింపు వంటి అత్యాధునిక యుద్ధ పద్ధతులపైనా వైమానిక దళం ప్రత్యేక దృష్టి పెట్టాలని రాజ్‌నాథ్ సింగ్ పిలుపునిచ్చారు.

జూన్ 2 నాటికి టిమ్స్‌లు కంప్లీట్

- ప్రజలకు పూర్తిస్థాయి సేవలందించాలి
- ఏడాదిలో ఉస్మానియా కొత్త భవనాలు ప్రజలకు అందాలి
- 3 టిమ్స్‌లకు ఏకీకృత నియామకాలు
- నిమ్స్... టిమ్స్‌ల మధ్య సమన్వయం ఉండాలి
- వైద్యులు, సిబ్బంది నియామక ప్రక్రియ వేగవంతం చేయండి
- వైద్య, ఆరోగ్య శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



హైదరాబాద్,
వచ్చే ఏడాది రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం నాటికి నిర్దేశిత పనులు పూర్తి చేసి ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. రానున్న జూన్ 2 నాటికి అల్వాల్, ఎల్బీ నగర్ టిమ్స్‌లు, వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, నిమ్స్ విస్తరణ పనులు పూర్తి కావాలని సీఎం అధికారులను ఆదేశించారు. వచ్చే ఏడాది డిసెంబర్ నాటికి ఉస్మానియా నూతన ఆసుపత్రి పనులు పూర్తి చేసి ప్రజలకు సేవలందించేలా చూడాలన్నారు. వైద్య, ఆరోగ్యశాఖపై ఎన్సీఆర్ హెచ్ఆర్టీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గురువారం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించి కీలక ఆదేశాలు జారీ చేశారు. టిమ్స్, వరంగల్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి, నిమ్స్ విస్తరణ, ఉస్మానియా...నూతన ఆసుపత్రుల నిర్మాణ పనులు, ఆయా ఆసుపత్రులకు అవసరమైన పరికరాల కొనుగోలు, వైద్యులు, సిబ్బంది నియామకాలు ఏకకాలంలో పూర్తి కావాలని ఆకాంక్షించారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం కింద ఒక్కో కుటుంబానికి అందించే వైద్య చికిత్స కవరేజీని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచిన విషయాన్ని ఈ సందర్భంగా సీఎం గుర్తు చేశారు. మూడేళ్లలోనే 9 మెడికల్ కాలేజీలు, 16 నర్సింగ్ కాలేజీలు, 28 పారామెడికల్ కాలేజీలు ఏర్పాటు చేశామన్నారు. సనత్ నగర్, అల్వాల్, ఎల్బీ నగర్ టిమ్స్‌లో వైద్యులు, ఇతర సిబ్బంది నియామకాలకు సంబంధించి ఏకీకృత విధానం పాటించాలని సీఎం రెడ్డి ఆదేశించారు. వైద్య సేవల అవసరాలకు అనుగుణంగా మూడు టిమ్స్‌ల మధ్య వైద్యులు, సిబ్బంది బదిలీలు జరిగేలా ఉండాలన్నారు. ఆసుపత్రుల నిర్వహణ, హౌస్ కీపింగ్ సిబ్బందిని ఔట్ సోర్సింగ్ విధానంలో చేపట్టాలని సీఎం సూచించారు. టిమ్స్ ల పర్యవేక్షణకు గ్రూప్-1 అధికారులను నియమిస్తామని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. హౌస్ కీపింగ్ సిబ్బందిపై పర్యవేక్షణకు విశ్రాంత సైనికాధికారులను నియమిస్తామన్నారు. నిర్వహణ, పర్యవేక్షణ బాధ్యతలకు వేరే సిబ్బంది ఉంటే, వైద్యులు పూర్తిగా వైద్య సేవలపై దృష్టిసారించే అవకాశం ఉంటుందని సీఎం అన్నారు. నిమ్స్‌లో శస్త్రచికిత్సలకు సమయం ఎక్కువ తీసుకుంటున్నందున సనత్ నగర్ టిమ్స్‌ను పూర్తి స్థాయిలో వినియోగించాలని సీఎం రెడ్డి ఆదేశించారు. నిమ్స్‌లో బెడ్లు లేకపోయినా, శస్త్రచికిత్సలకు అలస్యమైనా సనత్ నగర్ టిమ్స్‌ను వినియోగోకోవాలన్నారు. ఈ విషయంలో వైద్యారోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, నిమ్స్, టిమ్స్ డైరెక్టర్లు నిత్యం సమన్వయం చేసుకోవాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. టిమ్స్ లో వైద్యుల నియామకం ఫర్వాలేదు వరకు బయటి నుంచి వైద్యులను నియమించుకోవాలని, అందుకు అవసరమయ్యే మొత్తాన్ని వెంటనే విడుదల చేస్తామని సీఎం తెలిపారు. వైద్యులు, సిబ్బంది నియామక ప్రక్రియను వేగవంతం చేయాలని సీఎం ఆదేశించారు. తాము అధికారంలోకి వచ్చాక కొత్తగా 16 డయాలసిస్ సెంటర్లను ఏర్పాటు చేశామని సీఎం తెలిపారు. నిర్మాణంలో ఉన్నవోర్ 79 డయాలసిస్ సెంటర్ల పనులు సత్వరమే త్వరగా పూర్తి చేసి అందుబాటులోకి తీసుకురావాలని సీఎం ఆదేశించారు.

పెద్ద సంఖ్య పెంచాం.. వసతులు కల్పించాం...

గడచిన మూడేళ్లలోనే ప్రభుత్వ ఆసుపత్రుల్లో బెడ్ల సంఖ్యను 30 వేల నుంచి 38 వేలకు పెంచిన విషయాన్ని అధికారులు సీఎం దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఔట్ పేషెంట్ల సంఖ్య 7కోట్లకు నుంచి 9 కోట్లకు పెరగడం, ఇన్ పేషెంట్ల సంఖ్య 23 లక్షల నుంచి 24.80 లక్షలకు పెరగడంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంతృప్తి వ్యక్తం చేశారు. రాష్ట్ర బడ్జెట్లో "ఆరోగ్య రంగానికి గతంలో గనుసన 3.9 శాతం కేటాయించగా, గత మూడేళ్లుగా గనుసన 4.8 శాతం నిధులు కేటాయిస్తున్న విషయాన్ని సీఎం రేవంత్ రెడ్డి ప్రస్తావించారు. మూడేళ్లలోనే వైద్యులు, నర్సులు, ఏఎన్ఎంలు, పారా మెడికల్ సిబ్బంది కలిసి 13,401 నియామకాలు పూర్తి చేశామని సీఎం తెలిపారు. మరో 5,640 నియామకాల ప్రక్రియ కొనసాగుతోందన్నారు. ప్రజారోగ్యానికి పెద్ద పీట వేసే క్రమంలో వైద్యారోగ్య శాఖకు అవసరమైన నిధులను ఎంత మొత్తమైనా విడుదల చేస్తామని ముఖ్యమంత్రిరేవంత్ రెడ్డిస్పష్టం చేశారు. సమీక్షలో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, సీఎం కార్యదర్శి మాణిక్ రాజ్, వైద్య, ఆరోగ్య శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ క్రిస్టినా జోంగ్థూ, టీజీఎంఎస్ఐడీసీ కార్యదర్శి డాక్టర్ గౌరవ్ ఉప్పల్, వైద్య, ఆరోగ్య శాఖ కమిషనర్ ముషారఫ్ అలీ ఫారూఖీ, ఆర్ అండ్ బీ కార్యదర్శి ఇలంబర్తి, నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ రా?ల్ దేవరాజ్, టిమ్స్ డైరెక్టర్ డాక్టర్ నలతోలు తదితరులు పాల్గొన్నారు.

మరో తుపాన్ ముప్పు

(మొదటి తరువాయి)

వర్షాలు పడే సూచనలు ఉన్నాయని అధికారులు పేర్కొన్నారు. మరోవైపు తెలంగాణలో ఉష్ణోగ్రతలు సాధారణ స్థాయితో పోలిస్తే తగ్గుతున్నాయి. రాబోయే రెండు రోజుల్లో రాష్ట్రంలో సాధారణం కంటే 2 నుంచి 3 డిగ్రీల వరకు తక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉన్నదని వాతావరణ శాఖ తెలిపింది.

ప్రెస్ రిలీజ్‌ల కాలం పోయింది.. ఇప్పుడంతా ఇన్‌స్టా రీల్స్..!



న్యూఢిల్లీ:
మీడియాతో తనకు సుదీర్ఘకాలంగా అనుబంధం ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. జర్నలిజం రంగంలో కాలానుగుణంగా ఎన్నో మార్పులు చోటుచేసుకున్నాయని, సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి రావడంతో వార్తల ప్రసారం వేగం పెరిగిందని పేర్కొన్నారు. ఢిల్లీలోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో జర్నలిస్టుల కోసం నిర్వహించిన దీపావళి మిలన్ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. బీజేపీలో చేరిన తొలినాళ్లలో మీడియా కార్యక్రమాల కోసం కుర్చీలు వేసే బాధ్యత తనదేనని మోదీ గుర్తుచేసుకున్నారు. అప్పట్లో విలేకరులతో అనేక విషయాలు మాట్లాడేవాడినని తెలిపారు. ఒకప్పుడు మీడియా సమావేశాల ప్రత్యక్ష ప్రసారం కోసం అవుట్‌సైడ్ బ్రాడ్‌కాస్ట్ (ఓబీ) వ్యాన్లను ఉపయోగించేవారని, ఇప్పుడు మొబైల్ ఫోనే బ్రాడ్‌కాస్ట్ వాహనంగా మారిపోయిందని వివరించారు. గతంలో ఏదైనా కార్యక్రమం నిర్వహిస్తే పత్రికా ప్రకటనలు విడుదల చేసేవారని, ప్రస్తుతం సామాజిక మాధ్యమాల విస్తృతితో ఇన్‌స్టాగ్రామ్ రీల్స్ ద్వారా కూడా సమాచారం ప్రజలకు చేరుతోందని అన్నారు. విపత్తులు, సంక్షోభాల సమయంలో క్షేత్రస్థాయి జర్నలిస్టులు వార్తల సేకరణ కోసం ఎంతో శ్రమిస్తారని, ఎంతదూరమైనా వెళ్లి వాస్తవాలను ప్రజలకు చేరవేస్తారని ప్రశంసించారు. మీడియా ప్రపంచంలో సాధ్యం కానిదంటూ ఏదీ లేదని పేర్కొన్నారు. దేశాభివృద్ధి కోసం తమ ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను వివరిస్తూ, పేదరిక నిర్మూలనకు ప్రత్యేకంగా కృషి చేసినట్లు చెప్పారు. గతంలో గరీబీ హఠావో వంటి నినాదాలకే పరిమితమైన పరిస్థితి ఉండేదని, తమ ప్రభుత్వం గత 12 ఏళ్లలో 50 కోట్ల మందిని దారిద్ర్యరేఖ నుంచి బయటపడేసిందని వెల్లడించారు. దేశంలో వివిధ రంగాల్లో అసాధారణ విజయాలు సాధిస్తున్న వ్యక్తులు ఎంతోమంది ఉన్నారని, వారి విజయగాథలను వెలుగులోకి తెచ్చి ప్రపంచానికి పరిచయం చేయాలని జర్నలిస్టులకు ప్రధాని పిలుపునిచ్చారు.

బీజేపీ, ఆరెస్సెస్ విదేశీ అంటూ నా తల్లిని విమర్శించాయి :



న్యూఢిల్లీ
వాయనాడ్ ఎంపీ ప్రియాంక గాంధీ ఇటీవల తన తల్లి సోనియా గాంధీ విడుదల చేసిన ఆత్మకథ 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' ను గట్టిగా సమర్థించారు. తన గురించి తాను చెప్పుకొనే హక్కు ఆమెకు ఉందని అన్నారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు గత కొన్నేళ్లుగా సోనియాగాంధీపై అబద్ధాలు ప్రచారం చేస్తూ కల్పిత కథలు అల్లాయని మండిపడ్డారు.ఇప్పుడు వారంతా ఆ పుస్తకాన్ని చదువుతున్నందుకు సంతోషంగా ఉందన్నారు. వయనాడ్ పర్యటనకు వెళ్లిన ప్రియాంక గాంధీ.. అక్కడ మీడియాతో మాట్లాడారు. విదేశీ మహిళ అంటూ బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు నిరంతరం విమర్శిస్తున్నా సోనియా మాత్రం ఇప్పటివరకు నోరెత్తలేదన్న అంశాన్ని గుర్తుచేశారు. భారత్‌లో తన తల్లి జీవితం గురించి బీజేపీ, ఆర్ఎస్ఎస్ నోటికొచ్చినట్లు మాట్లాడాయని విమర్శించారు. తన తల్లిపై అబద్ధాలు ప్రచారం చేస్తూ కల్పిత కథనాలు రాశారని మండిపడ్డారు. అయినా అమ్మ ఇన్నాళ్లూ మౌనంగా ఉండిపోయారని, ఇప్పుడు వాస్తవాలను పుస్తకం రూపంలో ఆమే స్వయంగా వెల్లడించారని ప్రియాంకాగాంధీ చెప్పారు. అందులో తప్పేముందని, అది ఆమె హక్కు అని సమర్థించారు. ఇన్నాళ్లు బీజేపీ అబద్ధాలు చెబితే.. ఇప్పుడు నిజమేంటో ప్రజల ముందుకు నా తల్లి తీసుకొచ్చారని ప్రియాంకాగాంధీ అన్నారు.

ప్రత్యేక ఆకర్షణగా నిలిచిన ఏపీ పెవిలియన్

(మొదటి తరువాయి)



చేపడుతున్న పనులు, విశాఖపట్నం అభివృద్ధి ప్రణాళికలపై ప్రత్యేకంగా వివరించారు. రాష్ట్రంలో చిన్న, మధ్య తరహా పరిశ్రమల అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను సైతం నేతల దృష్టికి తీసుకెళ్లారు. పారిశ్రామిక ప్రగతికి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను అధికారులు స్పష్టం చేశారు.

సాంస్కృతిక ప్రదర్శనలను తిలకించిన నేతలు

అనంతరం పెవిలియన్‌లోని సాంస్కృతిక ప్రదర్శనలను నేతలు ఆసక్తిగా తిలకించారు. రాష్ట్ర సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టేలా ఏర్పాటు చేసిన కళాకృతుల వద్ద కేంద్రమంత్రి పీయూష్ గోయల్, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ ఫొటోలు దిగారు. గిరిజనులు రూపొందించిన చిత్రాలను ప్రత్యేకంగా పరిశీలించి, కేంద్రమంత్రి, సీఎం స్వయంగా సమానా చిత్రాలను తీర్చిదిద్దడం విశేషం. తోలు బొమ్మలాట, పెన్ కలంకారీ వంటి కళారూపాల స్టాళ్లను సందర్శించారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి చెందిన ప్రముఖ కళాకారులు, వారి నైపుణ్యాల గురించి సీఎం చంద్రబాబు కేంద్రమంత్రికి వివరించారు.

అరకు కాఫీని రుచి చూసిన నేతలు

పర్యటనలో భాగంగా, అరకు కాఫీ స్టాల్ వద్ద సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్, బీజేపీ ఏపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌తో కలిసి కేంద్రమంత్రి పీయూష్ గోయల్ అరకు కాఫీని రుచి చూశారు. కాసేపు సరదాగా ముచ్చటించారు. అనంతరం సదస్సు ప్రాంగణంలో కేంద్ర మంత్రి, సీఎం, డిప్యూటీ సీఎం బ్యాటరీ కారులో కలిసి ప్రయాణించారు. ఈ పర్యటన రాష్ట్ర అభివృద్ధికి కేంద్రం అందిస్తున్న సహకారానికి, బలమైన బంధానికి నిదర్శనంగా నిలిచింది

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం-ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

కేశంపేట్ మండలంలో అభివృద్ధి పనులకు శ్రీకారం.. రేషన్ షాప్ ల ప్రారంభోత్సవాలు, స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

దేవునిగుడి తండా, రాగ్యతండా, చింతకుంటపల్లి, పాటిగడ్డ గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే



రంగారెడ్డి జిల్లా బ్యూరో, నవంబర్ 12 (జర్నలిస్ట్ డైరీ) :

కేశంపేట్ మండలంలోని దేవునిగుడి తండా, రాగ్యతండా, చింతకుంటపల్లి, పాటిగడ్డ గ్రామాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు షాద్‌నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ శ్రీకారం చుట్టారు. గ్రామాల్లో నూతన రేషన్ దుకాణాల ప్రారంభోత్సవాలు, స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపనలు నిర్వహించారు.దేవునిగుడి తండాలో రేషన్ షాప్ ప్రారంభం.. 40 స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

దేవునిగుడి తండా గ్రామ పంచాయతీలో చౌకధరల పంపిణీ దుకాణం సెకండ్ సేల్ పాయింట్ కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా 40 మంది లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. అనంతరం గ్రామంలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు.అదేవిధంగా రాగ్యతండాలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు. గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు అవసరమైన పైప్‌లైన్, గేట్ వాల్ మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. అలాగే మహిళా సంఘాల సభ్యులు సమావేశాలు నిర్వహించుకోవడానికి అవసరమైన కుర్చీలు, బీరువా, జమఖానాలు అందిస్తానని తెలిపారు.

చింతకుంటపల్లిలో నూతన రేషన్ షాప్ ప్రారంభం.. 54 స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

చింతకుంటపల్లి గ్రామ పంచాయతీలో నూతన రేషన్ డీలర్ దుకాణాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల గృహప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా 54 మంది లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. గ్రామంలో ఎస్సీ కమ్యూనిటీ హాల్ మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మహిళా సంఘ భవనం నిర్మాణం పూర్తి చేసేందుకు అవసరమైన నిధులు మంజూరు చేయిస్తానని, మహిళా సంఘాల సమావేశాల నిర్వహణకు కుర్చీలు, జమఖానాలు అందిస్తానని తెలిపారు.

పాటిగడ్డలో రేషన్ షాప్ ప్రారంభం.. 37 మందికి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ


పాటిగడ్డ గ్రామ పంచాయతీలో నూతన రేషన్ డీలర్ దుకాణాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం 37 మంది లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. గ్రామంలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించడం, అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలను అందించడం తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీరు, పారిశుద్ధ్యం, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. మహిళా సంఘాలను బలోపేతం చేయడంతో పాటు వారు సమావేశాలు నిర్వహించుకోవడానికి అవసరమైన సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమాల్లో కొత్తపేట సింగిల్ విండో చైర్మన్ యెన్నం శ్రీధర్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యురాలు తాండ్ర విశాల శ్రావణ్ రెడ్డి, ఎంపీడీవో రవిచంద్ర రెడ్డి, తహశీల్దార్ రాజేందర్ రెడ్డి, కేశంపేట్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు రమేష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జగదీశ్వర్ అప్పా, బాలరాజు గౌడ్, కాంగ్రెస్ పార్టీ గిరిజన విభాగం రాష్ట్ర కోఆర్డినేటర్ రఘు నాయక్, మండల కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు వీరేశ్, నందిగామ సింగిల్ విండో చైర్మన్ చంద్రపాల్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం చైర్మన్ జాంగారి రవి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు కరుణాకర్, కల్లు సాయిలు, గ్రామాల సర్పంచులు సుజాత, శశిరేఖ, భాస్కర్ గౌడ్, శ్యామల అఖిల్, పోచామొని రమేష్, పల్లె ఆనంద్, నాగేశ్వర్, కొట్టం నరేందర్ రెడ్డి, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు గుండె రాణి, మహిళా కాంగ్రెస్ నాయకురాలు అనసూయ, కాంగ్రెస్ పార్టీ నాయకులు జితేందర్ రెడ్డి, కరణకర్ రెడ్డి, తుపాకుల శేఖర్, ముబారక్, సీతారాం, అన్నారం బాలు నాయక్, వేముల్ నర్వ మల్లేష్, గోపానీ భీమయ్య, కాకునూర్ లింగం, శ్రీనాథ్, రమేష్, వంశీ గౌడ్, సుదర్శన్, కృష్ణయ్య, సరికొండ రమేష్, యాదగిరి, కోడూరు రాములు, చిర్ర శ్రీను తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ నేషనల్ అవార్డు -2026కు బల్గురి శోభారాణి ఎంపిక

కిష్టాపూర్ గ్రామానికి చెందిన ప్రముఖ అంబేడ్కరైట్ పంచాయతీ కార్యదర్శికి జాతీయ స్థాయి గుర్తింపు





జర్నలిస్ట్ డైరీ పరిగి నవంబర్ 12

కిష్టాపూర్ గ్రామానికి చెందిన బల్గురి శోభారాణి, ప్రతిష్టాత్మక 'డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ నేషనల్ అవార్డు--2026'కు ఎంపికయ్యారు. బహుజన సాహిత్య అకాడమీ (బీఎస్ఏ) జాతీయ అధ్యక్షులు, అవార్డు సెలక్షన్ నేషనల్ కమిటీ చైర్మన్ నల్ల రాధాకృష్ణ ఈ మేరకు ప్రకటన విడుదల చేసి, హైదరాబాద్‌లోని అకాడమీ జాతీయ కార్యాలయంలో శోభారాణికి అవార్డు ఆహ్వాన పత్రాన్ని అందజేశారు.

పంచాయతీ కార్యదర్శిగా అంకితభావంతో విధులు నిర్వర్తిస్తూనే, ప్రముఖ అంబేడ్కరైట్‌గా, గాయనిగా సామాజిక చైతన్యం కలిగిస్తూ పలు పురస్కారాలు అందుకున్నందుకు గాను ఆమెకు ఈ జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల సాహిత్యాన్ని ముందుకు తీసుకెళ్లడం కోసం ప్రజా ఉద్యమకారులకు, సంఘసేవకులకు, రచయితలకు, కవులకు బహుజన సాహిత్య అకాడమీ ఏటా ఈ అవార్డులను ప్రదానం చేస్తోందని నల్ల రాధాకృష్ణ తెలిపారు. ఈ నెల 15వ తేదీన దేశ రాజధాని న్యూఢిల్లీలో నిర్వహించనున్న బహుజన సాహిత్య అకాడమీ 20వ నేషనల్ కాన్ఫరెన్స్‌లో శోభారాణికి ఈ అవార్డును ప్రదానం చేయనున్నారు.

చంద్రకళకు నివాళులు అర్పించిన ప్రజా సంఘాల నాయకులు



రంగారెడ్డి జిల్లా బ్యూరో, నవంబర్ 12 (జర్నలిస్ట్ డైరీ)

శాతవాహన విద్యార్థి సంచార జాతికి చెందిన డక్కలి కుటుంబానికి చెందిన అతి పేదరికంకు నుండి వచ్చిన చంద్రకళ మరణం అత్యంత విషాదం. చంద్రకళ సంస్మరణ సభ చైతన్య మహిళా సంఘం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో షాద్ నగర్ పెన్షనర్ల హాలులో జరిగింది.దీనికి అధ్యక్షత చైతన్య మహిళా సంఘం రాష్ట్ర కో కన్వీనర్ శ్రీదేవి వహించగా ఉన్నత చదువులు చదువుకున్న చంద్రకళ ఇలా అనుమానస్పదంగా మరణించటం ఆడపిల్లలు మరణాలు, హత్యలు, వేదింపులు ప్రభుత్వాల వైఫల్యాలు ఉన్నాయని శ్రీదేవి మాట్లాడారు.చంద్రకళ మరణం పై సమగ్ర విచారణ జరిపి హంతకులను కఠినంగా శిక్షించాలని చంద్రకళ కుటుంబానికి 50 లక్షల ఎక్స్గ్రేషియా చెల్లించాలని కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని పౌరహక్కుల సంఘం రాష్ట్ర నాయకులు తిరుమలయ్య మాట్లాడారు. కళాకారులకు అందించే పెన్షన్ మరియు ఉద్యోగాలు డక్కలి కళాకారులకు ఇవ్వాలని యూనివర్సిటీలో ప్రత్యేక షీ టీమ్స్ ఏర్పాటు చేయాలని లైంగిక వేధింపులు వ్యతిరేక కమిటీలు ఏర్పాటు చేయాలని శాతవాహన యూనివర్సిటీ జేఏసీ మహేష్ మాట్లాడారు డక్కలి కుటుంబాలను మొత్తంగా ఆదుకోవాలని వారి కుటుంబానికి న్యాయం చేయాలని చంద్రకళ తల్లి లక్ష్మమ్మ తండ్రి యాదయ్య కోరారు చైతన్య మహిళా సంఘం నుండి శ్రీదేవి, అలివేలు, శాంత,పాలమూరు అధ్యాయం అధ్యయన వేదిక నుండి రవీంద్రనాథ్,ఎస్ఎఫ్ఐ నుండి శ్రీకాంత్, టిపిఎఫ్ నుండి అర్జునప్ప, కేఏఎన్పిఎస్ నుండి మోహన్ కృష్ణ,బీసీ సేన నుండి ప్రశాంత్, ఏఐఎస్ఎఫ్ నుండి ఆకాష్,మైనార్టీ హక్కుల నాయకులు నాయకుడు అబ్దుల్ రబ్ జామి సభలో పాల్గొన్నారు.

చంద్రకళ మరణాంతరం శాతవాహన యూనివర్సిటీ ఇచ్చిన హామీలన్నీ కూడా వెంటనే నెరవేర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పైన పెట్టిన డిమాండ్లన్నీ వెంటనే ప్రభుత్వం నెరవేర్చాలని సభాముఖంగా కోరారు.

నిమోనియాపై గర్భిణులు బాలింతలకు అవగాహన

పిల్లల్లో వ్యాధి లక్షణాలను గుర్తించి వెంటనే వైద్యులను సంప్రదించాలి

చించోడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ స్రవంతి



రంగారెడ్డి జిల్లా బ్యూరో, నవంబర్ 12 (జర్నలిస్ట్ డైరీ) :

నిమోనియా వ్యాధిపై గర్భిణులు, బాలింతలు అవగాహన కలిగి ఉండాలని చించోడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు డాక్టర్ స్రవంతి సూచించారు. ప్రపంచ నిమోనియా దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం చించోడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులు, బాలింతలకు చిన్నపిల్లల్లో వచ్చే నిమోనియా వ్యాధి, దాని లక్షణాలు, నివారణ చర్యలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ స్రవంతి మాట్లాడుతూ నిమోనియా అనేది ఊపిరితిత్తులకు సోకే తీవ్రమైన ఇన్ఫెక్షన్ అని, దీనివల్ల ఊపిరితిత్తుల్లోని గాలి సంచుల్లో వాపు ఏర్పడి ద్రవం లేదా చీము చేరుతుందని వివరించారు. బ్యాక్టీరియా, వైరస్, ఫంగస్ కారణంగా ఈ వ్యాధి వస్తుందని, ముఖ్యంగా ఐదేళ్లలోపు పిల్లలు, రెండేళ్లలోపు శిశువులు, వృద్ధులు, పోషకాహార లోపం, రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారు ఎక్కువగా ప్రభావితమయ్యే అవకాశం ఉందన్నారు. దగ్గు, జలుబు, జ్వరం, వేగంగా శ్వాస తీసుకోవడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, ఛాతీ లోపలికి లాగబడటం వంటి లక్షణాలు కనిపిస్తాయని, తీవ్రమైన పరిస్థితుల్లో పెదవులు, నాలుక నీలం రంగులోకి మారుతాయని తెలిపారు.నిమోనియా నివారణకు పిల్లలకు జాతీయ టీకాల కార్యక్రమం ప్రకారం అన్ని టీకాలు వేయించాలని, న్యూమోకోకల్ కాంజుగేట్ టీకా (పీసీవీ) తప్పనిసరిగా వేయించాలని సూచించారు. శిశువులకు మొదటి ఆరు నెలల పాటు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, పోషకాహారం అందించాలని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని తెలిపారు. చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవడం, ఇళ్లలో దుమ్ము, పొగ లేకుండా చూసుకోవడం, దగ్గు, తుమ్ముల సమయంలో జాగ్రత్తలు పాటించడం ద్వారా వ్యాధి వ్యాప్తిని తగ్గించవచ్చన్నారు. పిల్లల్లో అనారోగ్య లక్షణాలు కనిపిస్తే ఆలస్యం చేయకుండా సమీప ఆసుపత్రికి తీసుకెళ్లాలని సూచించారు. వ్యాధి తీవ్రతను బట్టి వైద్యులు యాంటీబయాటిక్స్, అవసరమైన చికిత్స, ఆక్సిజన్ అందిస్తారని వివరించారు.నిమోనియాను నివారిద్దాం.. బాలల ప్రాణాలను కాపాడుదాం అనే నినాదంతో ప్రతి ఒక్కరూ వ్యాధిపై అవగాహన పెంచుకోవాలని డాక్టర్ స్రవంతి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ జె. శ్రీనివాసులు, హెల్త్ సూపర్‌వైజర్ శ్రీరామ, స్టాఫ్ నర్స్ వినీత, ఫార్మసిస్ట్ పర్వతాలు, ల్యాబ్ టెక్నీషియన్ అశోక్, ఏఎన్ఎంలు మధువాణి, శిరీష, కవిత, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.'

శ్రీకాళహస్తి ఆలయంలోని అన్నప్రసాద పోటులో అగ్నిప్రమాదం.. భారీగా చెలరేగిన మంటలు

-నెయ్యి ఒలికిపడటం వల్ల చెలరేగిన మంటలు
-భయంతో పరుగులు తీసిన భక్తులు
-సకాలంలో స్పందించి మంటలను అదుపుచేసిన అగ్నిమాపక సిబ్బంది



శ్రీకాళహస్తి, జర్నలిస్ట్ డైరీ :

ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీకాళహస్తీశ్వర ఆలయంలో కాసేపటి క్రితం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఆలయ ప్రాంగణంలోని దక్షిణ గోపురం సమీపంలో ఉన్న అన్నప్రసాద పోటులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. స్వామివారికి లడ్డు, వడ, అన్నప్రసాదాలు తయారు చేస్తున్న సమయంలో ఈ ప్రమాదం జరగడంతో... పోటు నుంచి భారీగా అగ్నికీలలు, దట్టమైన పొగ ఎగసిపడ్డాయి.

నెయ్యి ఒలికిపడటంతోనే.. మంటలు

నెయ్యి ఒలికిపడటం వల్ల మంటలు చెలరేగినట్టు ప్రాథమికంగా తెలుస్తోంది. ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో పోటులో ప్రసాదాలు తయారు చేస్తున్న సిబ్బందితో పాటు పరిసరాల్లో ఉన్న భక్తులు తీవ్ర భయాందోళనకు గురై పరుగులు తీశారు. సమాచారం అందిన వెంటనే ఆలయ సిబ్బంది, అగ్నిమాపక సిబ్బంది రంగంలోకి దిగి మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకొచ్చారు.

ముందస్తు జాగ్రత్త చర్యగా

మండపాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేత

ప్రమాదం మరింత విస్తరించకుండా ముందస్తు జాగ్రత్త చర్యగా సమీపంలోని మండపాలకు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రాణనష్టం లేదా గాయాలు కాకపోవడంతో ఆలయ వర్గాలు, భక్తులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాద విషయం తెలిసిన వెంటనే ఆలయ ఈవో, ట్రస్ట్ బోర్డు చైర్మన్ ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ప్రమాదం కారణంగా ప్రసాదాల తయారీని తాత్కాలికంగా నిలిపివేశారు. ప్రమాదానికి గల పూర్తి కారణాలపై అధికారులు ఆరా తీస్తున్నారు.

చేయూత పింఛన్ల మంజూరు ప్రొసీడింగ్స్ అందజేసిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడమే లక్ష్యం



రంగారెడ్డి జిల్లా బ్యూరో, నవంబర్ 12 (జర్నలిస్ట్ డైరీ) :

రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణ మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ అధ్యక్షతన చేయూత పింఛన్ల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా షాద్‌నగర్ పట్టణానికి నూతనంగా751మందికి పింఛన్లు మంజూరైన వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, నేత కార్మికులు, గీత కార్మికులకు మంజూరు ప్రొసీడింగ్స్‌ను షాద్‌నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ అందజేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అర్హులైన పేదలకు అండగా నిలవాలనే లక్ష్యంతో సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. సమాజంలో ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, నేత మరియు గీత కార్మికులకు పింఛన్లు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు.కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందే మోహన్ ముదిరాజ్ మున్సిపల్ కమిషనర్ సునీత రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్ అగ్గనూర్ విశాల విశ్వం,సి పెంటయ్య, మురళీమోహన్, రాజు నాయక్, కొప్పునూరి ప్రవీణ్, శిరీష అనిల్ కుమార్, బచ్చలి నరేష నాజియా బేగం,ఆరిఫా బేగం, అశోక్ ,జి టి వసంత శ్రీనివాస్, అనితా రఘునాథ యాదవ్,,జయలక్ష్మి కిషోర్, వాణి శ్రీ పాండు రంగారెడ్డి,పి గోపాల్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబార్ అలీ ఖాన్, మాజీ మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ విశ్వం,పట్టణ అధ్యక్షుడు శ్రీధర్ ముదిరాజ్, మున్సిపల్ కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ ఖదీర్ సుజీవన్, రాజేందర్ రెడ్డి, సాదిక్, మూబారక్ అలీ ఖాన్, సర్వర్ పాషా, సీనియర్ నాయకుడు రఘు నాయక్, బాలరాజ్ గౌడ్ బాలరాజు గౌడ్, జాం గారి రవి, శ్రీశైలం గౌడ్, మనీష్ మాధవలు యాదవ్, తంగడపల్లి శంకర్,మంగ అశోక్, రవితేజ, యాదగిరి యాదవ్, అర్జున్ లక్ష్మణ్ ,గంగమోని సత్తయ్యశ్రీనివాస్ రెడ్డి,ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

ఇంద్రారెడ్డి ఆల్విన్ కాలనీ వాసులు తగు న్యాయం చేయాలని గాంధీ కి వినతి పత్రం



రంగారెడ్డి జిల్లా బ్యూరో, నవంబర్ 12 (జర్నలిస్ట్ డైరీ) :
హఫీజ్పేట్ డివిజన్ పరిధిలోని ఇంద్రారెడ్డి ఆల్విన్ కాలనీ లో నూతనంగా నిర్మించబోయే మియాపూర్ శ రోడ్డు ఫ్లై ఓవర్ మరియు అండర్ పాస్ నిర్మాణంలో భాగంగా ఇండ్లు, స్థలాలు కోల్పోతున్న వారు మరియు ఇంద్రారెడ్డి ఆల్విన్ కాలనీ వాసులు తగు న్యాయం చేయాలని పియేసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ ని మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం సమర్పించడం జరిగినది.
ఈ సందర్భంగా ఇంద్రారెడ్డి ఆల్విన్ కాలనీ వాసులు మాట్లాడుతూ మియాపూర్ ఫ్లై ఓవర్ నిర్మాణం వలన స్థలాలు, మరియు ఇండ్లు కోల్పోతున్న మాకు తగిన న్యాయం చేయాలని, మాకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అదుకోవాలని కాలనీ వాసులు పియేసి చైర్మన్ గాంధీ కి విన్నవించుకున్నారు.
ఈ సందర్భంగా గాంధీ... మాట్లాడుతూ మియాపూర్ ఫ్లై ఓవర్ నిర్మాణం మరియు అండర్ పాస్ వలన రోడ్డు పక్కన ఉన్న ఇండ్లు కోల్పోతున్న బాధితులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని, ఎవరు అధైర్య పడకూడదు అని, ప్రతి ఒక్కరికి న్యాయం చేస్తామని, అందరికీ ఆమోదయోగ్యంగా నష్టపరిహారం వచ్చేలా చూస్తానని, ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లి తప్పకుండా న్యాయం జరిగేలా చూస్తానని, అందరికీ టీడీఆర్ అందేలా చూస్తామని, అందరికీ ఆమోదయోగ్య విధంగా మియాపూర్ ఫ్లై ఓవర్ నిర్మాణం చేపట్టడం జరుగుతుంది అని తెలియచేశారు.
నిత్యం పెరుగుతున్న ట్రాఫిక్ దృష్ట్యా , ట్రాఫిక్ రహిత సమాజం కోసం, ప్రజల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ఫ్లై ఓవర్ ను నిర్మించడం జరుగుతుంది అని, ఫ్లై ఓవర్ నిర్మాణం చేపట్టడం జరుగుతుంది అని, ప్రతి ఒక్కరు సహకరించాలని,, రోడ్డు విస్తరణ, ఫ్లై ఓవర్ నిర్మాణం వలన ట్రాఫిక్ కష్టాలు తప్పునని, సమయం, ఇంధనం ఆదా అవునని ,ప్రజలకు సుఖవంతమైన ప్రయాణానికి బాటలు వేస్తామని తెలియచేశారు.
ఈ కార్యక్రమంలో ఇంద్రారెడ్డి రెడ్డి ఆల్విన్ కాలనీ వాసులు ,స్థానికులు తదితరులు పాల్గొన్నారు..

పంచాయతీ ఎన్నికల నిర్వహణకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలి

-అత్యంత పారదర్శకతతో ఎన్నికలు నిర్వహించాలి
-రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠ





ఒంగోలు, ప్రకాశం బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :
రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్రపునేట పంచాయతీ ఎన్నికలపై నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకాశం జిల్లా మూడు విడతల్లో పంచాయతీ ఎన్నికల నిర్వహణకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసి, అత్యంత పారదర్శకతతో ఎన్నికలు నిర్వహించాలని ఆయన అధికారులకు సూచించారు. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ పి రాజబాబు కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ ఆలు నుండి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన జిల్లా సన్నద్ధత వివరాలను వివరించిన కలెక్టర్ పి. రాజాబాబు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేక నిఘా, ఎన్నికల కోడ్ అమలుపై కమిషన్ ప్రధాని ఎన్నికల అధికారి కీలక దిశానిర్దేశం చేశారు పోలింగ్ సిబ్బందికి శిక్షణ, బ్యాలెట్ బాక్సుల భద్రత మరియు ఓటర్లకు కనీస వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి, రెవెన్యూ అధికారి వెంకటరమణ, డిపిఓ అనుపమ, ఈడీ బీసీ కార్పొరేషన్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

జనగణన-2027ను పకడ్బందీగా నిర్వహించాలి

-మతం, అంగవైకల్యం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలి
-క్షేత్రస్థాయి సిబ్బందికి సూచించిన జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి





ఒంగోలు, ప్రకాశం బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :
జనగణన-2027 ప్రక్రియలో క్షేత్రస్థాయి సిబ్బంది అత్యంత అప్రమత్తంగా, బాధ్యతాయుతంగా వ్యవహరించి ఖచ్చితమైన వివరాలను సేకరించాలని జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి సూచించారు. ముఖ్యంగా మతం (రిలీజియన్), అంగవైకల్యం తదితర అంశాలకు సంబంధించి ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ సమగ్ర నివేదిక రూపొందించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.గురువారం కలెక్టర్ కార్యాలయంలోని ప్రజా సమస్యల పరిష్కార వేదిక హాలులో మండల అధికారులు, మున్సిపల్ కమిషనర్లు తదితరులకు సెన్సస్-2027పై నిర్వహిస్తున్న రెండు రోజుల శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు.ఈ సందర్భంగా శిక్షణలో వివరించిన అంశాలను క్షేత్రస్థాయిలో నిబంధనలకు అనుగుణంగా క్షుణ్ణంగా అమలు చేయాలని ఆమె సూచించారు. వివరాల సేకరణ సమయంలో ఎదురయ్యే సమస్యలను సున్నితంగా, సామరస్యపూర్వకంగా పరిష్కరించుకుంటూ సరైన సమాచారాన్ని నమోదు చేయాలని తెలిపారు.శిక్షణ కార్యక్రమాన్ని విపులంగా, సమగ్రంగా నిర్వహిస్తున్నందున అధికారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రస్తుత శిక్షణ అనంతరం మండల స్థాయిలో మాస్టర్ ట్రైనర్ల ద్వారా క్షేత్రస్థాయి సిబ్బందికి కూడా ప్రత్యేక శిక్షణ అందించనున్నట్లు వెల్లడించారు.ఈ కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ సెన్సస్ ఆపరేషన్ జే. నివాస్, ఆయన సిబ్బంది పాల్గొని అధికారులకు శిక్షణ అందించారు.

చంద్రకళ మృతిపై నిష్పక్షపాత విచారణ జరిపించాలి

డక్కలి కుటుంబాలకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు మంజూరు చేయాలి

చంద్రకళ సంస్మరణ సభలో ప్రజా, హక్కుల సంఘాల నాయకుల డిమాండ్



రంగారెడ్డి జిల్లా బ్యూరో, నవంబర్ 12 (జర్నలిస్ట్ డైరీ) :
శాతవాహన విశ్వవిద్యాలయంలో న్యాయ విద్య అభ్యసిస్తున్న దాకూరి చంద్రకళ అనుమానాస్పద మృతిపై సమగ్ర, నిష్పక్షపాత విచారణ జరిపించి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని ప్రజా, హక్కుల సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం షాద్‌నగర్ పెన్షనర్ భవన్‌లో చైతన్య మహిళా సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన చంద్రకళ సంస్మరణ సభలో ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పసుపుల ప్రశాంత్ మాట్లాడుతూ పేదరికం, సామాజిక వెనుకబాటుతనాన్ని అధిగమించి గురుకుల విద్య నుంచి డిగ్రీ, పీజీ వరకు ఉన్నత విద్యను అభ్యసించిన చంద్రకళ జీవితం ఎంతోమందికి స్ఫూర్తిదాయకమన్నారు. ఎస్సై కావాలనే లక్ష్యంతో పోటీ పరీక్షలకు సిద్ధమై, అనంతరం న్యాయ విద్యలో ప్రవేశం పొందారని గుర్తుచేశారు. తన చదువుతో పాటు పేద విద్యార్థులకు విద్యాబోధన చేస్తూ, సమాజంలోని సమస్యలపై అధికారులను ప్రశ్నించే చైతన్యం కలిగిన విద్యార్థిగా ఎదిగారని పేర్కొన్నారు.
నవంబర్ 1న హాస్టల్ గదిలో చంద్రకళ మృతిచెందిన ఘటనపై అనేక అనుమానాలు ఉన్నాయని, ఆమె తల్లిదండ్రులు తమ కుమార్తె ఆత్మహత్య చేసుకునే స్వభావం లేదని చెబుతున్న నేపథ్యంలో పోలీసులు అన్ని కోణాల్లో విచారణ జరిపి వాస్తవాలను బయటపెట్టాలని డిమాండ్ చేశారు. ఎవరినీ ముందుగానే దోషులుగా ప్రకటించడం తమ ఉద్దేశం కాదని, అయితే అనుమానాస్పద పరిస్థితుల్లో ఒక విద్యార్థిని మృతిచెందినప్పుడు నిజానిజాలు తెలుసుకోవడం ప్రజల హక్కు అని అన్నారు. దోషులు ఎవరైనా చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని, నిర్దోషులకు అన్యాయం జరగకూడదని స్పష్టం చేశారు. చంద్రకళ కుటుంబం ఎదుర్కొన్న పేదరికం, సామాజిక వెనుకబాటుతనం దక్కలి సమాజంలోని అనేక కుటుంబాల పరిస్థితికి అద్దం పడుతోందని ప్రశాంత్ అన్నారు. షాద్‌నగర్‌లో నివసిస్తున్న దక్కలి కులస్థులందరికీ ప్రభుత్వం డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ప్రత్యేక సర్వే నిర్వహించి అర్హులైన కుటుంబాలను గుర్తించి ఇళ్లు, భూమి, విద్య, ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. చంద్రకళ కుటుంబానికి తక్షణ ఆర్థిక సహాయం అందించడంతో పాటు మూడు ఎకరాల భూమి ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. దక్కలి, సంచార జాతుల పిల్లలు ఆర్థిక ఇబ్బందులతో చదువును మధ్యలోనే ఆపివేయకుండా ప్రత్యేక విద్యా సహాయ కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో విద్యార్థుల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ కౌన్సెలింగ్ కేంద్రాలు, భరోసా కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహించాలని, మహిళల భద్రతకు సంబంధించిన వ్యవస్థలను బలోపేతం చేయాలని అన్నారు. విద్యార్థులు తమ సమస్యలను స్వేచ్ఛగా చెప్పుకునే వాతావరణం కల్పించడం విద్యాసంస్థల బాధ్యత అని పేర్కొన్నారు.చంద్రకళ తిరిగి రాకపోయినా ఆమె ఆశయాలను, చదువు పట్ల ఉన్న పట్టుదలను, సమాజం పట్ల ఉన్న బాధ్యతను ముందుకు తీసుకెళ్లడమే ఆమెకు నిజమైన నివాళి అని అన్నారు. మరో విద్యార్థిని ఇలాంటి పరిస్థితుల్లో ప్రాణాలు కోల్పోకుండా చూడాలని, పేద విద్యార్థులు భయపడకుండా చదువుకునే వాతావరణం కల్పించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రజా, హక్కుల సంఘాల నాయకులు, విద్యార్థి సంఘాల ప్రతినిధులు, చంద్రకళ కుటుంబ సభ్యులు, మిత్రులు, శ్రేయోభిలాషులు పాల్గొన్నారు.

ప్రభుత్వం 'నిర్దేశించిన ధరలకే' 'బియ్యాన్ని' ప్రజలకు విక్రయించాలి

-మార్కాపురం జిల్లా జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు

-బియ్యం ధరల నియంత్రణ లక్ష్యంగా ఆదేశాలు

-బియ్యం వ్యాపారస్తులు, రైస్ మిల్లుల యజమానులతో సమావేశం





మార్కాపురం,జిల్లా బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :
మార్కెట్‌లో బియ్యం ధరలు పెరుగుతున్న నేపథ్యంలో, ప్రజలకు సరసమైన ధరలకు నాణ్యమైన బియ్యం అందుబాటులో ఉండేలా జిల్లా జాయింట్ కలెక్టర్ పులి శ్రీనివాసులు ఆధ్వర్యంలో బియ్యం వ్యాపారస్తులు మరియు రైస్ మిల్లుల యజమానులతో సమావేశం నిర్వహించారు.
ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ... ప్రభుత్వం నిర్దేశించిన ధరలకే బియ్యాన్ని ప్రజలకు విక్రయించాలని, హోల్ సేల్, రిటైల్ వ్యాపారులు మరియు రైస్ మిల్లుల యజమానులు ప్రభుత్వ ఆదేశాలను తప్పనిసరిగా పాటించాలని స్పష్టం చేశారు. ప్రతి బియ్యం దుకాణం మరియు రైస్ మిల్లు వద్ద బియ్యం రకాల వారీగా ప్రభుత్వం నిర్ణయించిన ధరలను తెలిపే ధరల పట్టికలను తప్పనిసరిగా ఏర్పాటు చేయాలన్నారు. అవి వినియోగదారులకు స్పష్టంగా కనిపించేలా ప్రదర్శించాలని ఆదేశించారు.ఈ సందర్భంగా బియ్యం రకాల వారీగా కిలోకు నిర్ణయించిన ధరల వివరాలను వెల్లడించారు.ఈ ప్రకారం
క్రమ సంఖ్య, బియ్యం రకం కిలో ధరలు ఈ క్రింద తెలిపిన ప్రకారం

1	బిపిటి సోనా రైస్	రూ.66/-
2	బిపిటి సాంబా రైస్	66/-
3	కేఎన్ఎం రైస్	66/-
4	హెచ్ఏంటి రైస్	రూ.76/-
5	అర్ఎన్ఆర్ రైస్	76/-
6	జై శ్రీరామ్ రైస్	82/-
7	ఎంటియు రైస్ రకాలు	రూ.47/-ల

మేరకు ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే అధిక ధరలకు బియ్యం విక్రయించడం, వినియోగదారుల నుంచి అదనపు ధరలు వసూలు చేయడం వంటి చర్యలకు పాల్పడితే సంబంధిత వ్యాపారులు మరియు రైస్ మిల్లుల యజమానులపై నిబంధనల ప్రకారం తగిన చర్యలు తీసుకుంటామని జేసీ పేర్కొన్నారు.ప్రజలకు నాణ్యమైన బియ్యాన్ని సరసమైన ధరలకు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని, ఈ విషయంలో వ్యాపారులు పూర్తి బాధ్యతతో వ్యవహరించి అధికారులకు సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మార్కాపురం జిల్లా పౌర సరఫరాల అధికారి అంకయ్య, డిఎం మార్కాపురం, లీగల్ మెట్రాలజీ ఇన్స్పెక్టర్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దార్లు, ఫుడ్ ఇన్స్పెక్టర్ లు, పాల్గొన్నారు. బియ్యం వ్యాపారస్తులు మరియు రైస్ మిల్లుల యజమానులు సమావేశానికి హాజరయ్యారు.

మృతి చెందిన గ్రామ సర్వేయర్ కుటుంబానికి రూ.1.22 కోట్ల ఆర్థిక భరోసా

-చెక్కు అందించిన జిల్లా కలెక్టర్ రాజాబాబు

ఒంగోలు,ప్రకాశం బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల వేతన ప్యాకేజీ ద్వారా



ఉమ్మడి ప్రకాశం జిల్లా బ్యూరో, జర్నలిస్ట్ డైరీ
ఉమ్మడి ప్రకాశం జిల్లా, పామూరు మండలం, బలిజ పాలెంలో గ్రామ సర్వేయర్‌గా విధులు నిర్వహించే బుడమగుంట పవన్ కుమార్ ప్రమాదంలో చనిపోవడంతో ఆయన కుటుంబానికి యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా అందిస్తున్న ' ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల శాలరీ ప్యాకేజీ ' ద్వారా మొత్తం రూ. 1.22 కోట్ల బీమా పరిహారము లభించింది. మృతునికి యూనియన్ బ్యాంకులో శాలరీ ఖాతా ఉన్నది. ఈ పరిహారంలో భాగంగా యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏపీ ప్రభుత్వ శాలరీ ప్యాకేజి కింద రూ.1,20,00,000 (ఒక కోటి ఇరవై లక్షల రూపాయలు), ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన కింద అదనంగా రూ.2,00,000/- లు మంజూరయ్యాయి.ఈ రెండు బీమా క్లెయిమ్‌లకు సంబంధించిన మొత్తం రూ.1,22,00,000 (ఒక కోటి ఇరవై రెండు లక్షల రూపాయలు) చెక్కును దివంగత ఉద్యోగి తండ్రి మరియు నామినీ అయిన బి. పరశురామరాజుకు ప్రకాశం జిల్లా కలెక్టర్ మరియు జిల్లా పి. రాజాబాబు గురువారం తన క్యాంపు కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు, వారి కుటుంబాలకు ఆపద సమయంలో ఆర్థిక భరోసా కల్పించే ఈ ప్యాకేజీ ఎంతో ఉపయోగకరమని ప్రశంసించారు. అదేవిధంగా, పరిహారం చెక్కును అందజేస్తూ ఈ మొత్తాన్ని కుటుంబ భవిష్యత్తు కోసం సద్వినియోగం చేసుకోవాలని నామినీకి సూచించారు. మృతుని స్వస్థలం సింగరాయకొండ మండలం పాకల గ్రామం. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఒంగోలు ప్రాంతీయ అధిపతి వి. రవికుమార్, ప్రాంతీయ కార్యాలయ చీఫ్ మేనేజర్ డి. సత్యజిత్, గాంధీ రోడ్ బ్రాంచ్ మేనేజర్ సాహూ, అసిస్టెంట్ మేనేజర్ శ్రీకాంత్ పాల్గొన్నారు.

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

పదో తరగతి పరీక్ష ఫీజు పేరుతో

ప్రైవేట్ పాఠశాలల దోపిడీ!

రూ.125 ఫీజుకు బదులుగా రూ.1,000 వసూళ్లా?

ఒక్కో విద్యార్థిపై అదనపు భారం.. తల్లిదండ్రుల జేబులకు చిల్లులు!



సూర్యాపేట:

విద్యను వ్యాపారంగా మార్చుకున్న కొన్ని ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు పదో తరగతి పరీక్ష ఫీజుల పేరుతో విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అధిక మొత్తాలు వసూలు చేస్తున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం నిర్ణయించిన పదో తరగతి పరీక్ష ఫీజు రూ. 125 కాగా, కొన్ని ప్రైవేట్ పాఠశాలల్లో ఒక్కో విద్యార్థి నుంచి దాదాపు రూ. 1,000 లేదా అంతకంటే ఎక్కువ మొత్తాలు వసూలు చేస్తున్నారని సూర్యాపేట బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షులు పోలోజు మహేష్ చారి ఆరోపించారు.

పరీక్ష ఫీజు పేరుతో ఇంత పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేయాల్సిన అవసరం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఒక్కో విద్యార్థి నుంచి సుమారు రూ. 1,000 చొప్పున అదనంగా వసూలు చేస్తే, వందలాది మంది విద్యార్థులు చదువుతున్న పాఠశాలల్లో లక్షల రూపాయలు వసూలయ్యే పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే పాఠశాల ఫీజులు, పుస్తకాలు, యూనిఫాంలు, ఇతర ఖర్చులతో సతమతమవుతున్న తల్లిదండ్రులపై ఇలాంటి అదనపు భారం మోపడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని విద్యాసంస్థలు పనిచేయాల్సింది పోయి, వివిధ పేర్లతో తల్లిదండ్రుల నుంచి అధిక మొత్తాలు వసూలు చేయడం ఆందోళనకరమన్నారు. పరీక్ష ఫీజుకు సంబంధించి ప్రభుత్వం నిర్ణయించిన నిబంధనలను పాఠశాలలు పాటిస్తున్నాయా లేదా అనే అంశంపై విద్యాశాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. ప్రైవేట్ పాఠశాలల్లో పదో తరగతి పరీక్ష ఫీజుల పేరుతో జరుగుతున్న అదనపు వసూళ్లపై విద్యాశాఖ అధికారులు తక్షణమే సమగ్ర విచారణ చేపట్టాలని పోలోజు మహేష్ చారి డిమాండ్ చేశారు. విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి వసూలు చేస్తున్న మొత్తాలకు సంబంధించిన వివరాలను పరిశీలించి, అక్రమ వసూళ్లు జరిగినట్లు నిర్ధారణ అయితే బాధ్యులైన యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. రూ. 125 పరీక్ష ఫీజు ఉంటే.. రూ. 1,000 వరకు వసూళ్లు ఎందుకు? విద్య పేరుతో తల్లిదండ్రులపై అదనపు ఆర్థిక భారం మోపుతున్న ప్రైవేట్ పాఠశాలల తీరుపై విద్యాశాఖ అధికారులు ఇప్పటికైనా స్పందించాలి.

విద్యార్థుల మౌలిక వసతులపై

ప్రత్యేక దృష్టి సారించాలి

జిల్లా పాలనాధికారి కుమార్ దీపక్

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ డైరీ) నవంబర్ 12,

ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేస్తూ ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతుందని, ఈ క్రమంలో ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాలలో విద్య అభ్యసిస్తున్న విద్యార్థులకు మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. గురువారం జిల్లాలోని కాసిపేట మండలంలోని ప్రాంతాలలో కొనసాగుతున్న అభివృద్ధి పనులు, కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో విద్యార్థులకు కల్పిస్తున్న మౌలిక సదుపాయాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ విద్యాసంస్థలలో చదువుతున్న విద్యార్థిని, విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించి, నాణ్యమైన విద్య, మెనూ ప్రకారం పౌష్టిక ఆహారం అందించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పాఠశాలలలో చేపట్టిన అభివృద్ధి పనులలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, పెండింగ్ లో ఉన్న పనులను వేగవంతం చేసి త్వరగా పూర్తిచేయాలని తెలిపారు. పాఠశాలలకు అవసరమైన బెడ్స్ ఇంకా అందుబాటులోకి రాలేదని గుర్తించి, సంబంధిత అధికారులతో మాట్లాడి వెంటనే బెడ్స్ సరఫరా చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇప్పటికే అందుబాటులోకి వచ్చిన పరుపులతో పాటు బెడ్స్‌ను కూడా త్వరగా ఏర్పాటు చేయాలని తెలిపారు. విద్యార్థులకు ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సదుపాయాలు కల్పించాలని, వంటశాల, భోజనశాలను పరిశుభ్రంగా నిర్వహించాలని, అవసరమైన అన్ని వసతులు







సమకూర్చుకోవాలని సూచించారు. మండలంలోని పెద్దాపూర్ గ్రామంలో కొనసాగుతున్న భూ రీ సర్వే ప్రక్రియను నాయబ్ తహసిల్దార్ అంజయ్యతో కలిసి పరిశీలించి, సర్వే పనులను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. రీ సర్వే సిబ్బంది ఉదయం వేళల్లోనే క్షేత్రస్థాయికి చేరుకొని పనులు ప్రారంభిస్తే ఎక్కువ భూమిని సర్వే చేయడానికి అవకాశం ఉంటుందని, తద్వారా పనులు త్వరగా పూర్తవుతాయని తెలిపారు. సర్వే సిబ్బందికి అవసరమైన సహకారం అందించాలని తహసిల్దార్లకు సూచించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ అక్రమ భూ ఆక్రమణలకు అవకాశం కల్పించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. దేవాపూర్ గ్రామంలోని బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించి విద్యార్థులకు కల్పిస్తున్న వసతులను పరిశీలించారు. వంటశాలను తనిఖీ చేసి ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం భోజనం అందించడంపై విద్యార్థులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. పాఠశాలలోని తరగతి గదులు, వసతి గదులు, ఇతర మౌలిక సదుపాయాలను పరిశీలించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతి సదుపాయాలు కల్పించాలని, సెలవుల అనంతరం విద్యార్థులందరూ తిరిగి పాఠశాలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం బెల్లంపల్లి మండల కేంద్రంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో సబ్ కలెక్టర్ మనోజ్ తో కలిసి మండలాల తహసిల్దార్లతో భూ రీ సర్వే, జి.ఓ. నంబర్ 59, 76 అమలు, భూభారతి డిజిటల్ ప్రక్రియ తదితర అంశాలపై సమీక్షా సమావేశం నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న భూ సంబంధిత దరఖాస్తులు, సర్వే పనులను నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని సూచించారు. సింగరేణి ప్రాంతానికి సంబంధించిన భూ సమస్యలు, జి.ఓ. నంబర్ 76 క్రింద చేపట్టవలసిన చర్యలపై సంబంధిత అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని తెలిపారు. భూ రీ సర్వే పనులు వేగంగా పూర్తయ్యేలా తహసిల్దార్లు క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని, సర్వే సిబ్బంది ఉదయాన్నే గ్రామాలకు చేరుకొని పనులు ప్రారంభించేలా సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆయా మండలాల తహసీల్దార్లు, సంబంధిత అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు

ప్రజా సంక్షేమం, అభివృద్ధే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

బోడుప్పల్ సర్కిల్‌లో ప్రజా సమస్యలపై పర్యటించిన డీసీసీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్



నాగారం, నవంబర్ 12:-(జర్నలిస్ట్ డైరీ)

ప్రజా సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజాపాలన ప్రభుత్వం పనిచేస్తోందని మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు.

గురువారం బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని బోడుప్పల్ డివిజన్ అంబేద్కర్ నగర్, జ్యోతి నగర్ కాలనీలలో ఆయన పర్యటించి స్థానిక ప్రజలను కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీలలో నెలకొన్నసమస్యలను స్థానికుల ద్వారా తెలుసుకుంటూ, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని భరోసా ఇచ్చారు.

ఈ సందర్భంగా వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ప్రజా పాలనను కొనసాగిస్తోందని తెలిపారు. ప్రతి పేద కుటుంబానికి కూడు, గూడు కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించడంతో పాటు స్థానిక సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇస్తామని అన్నారు. ఈ పర్యటనలో బోడుప్పల్ మాజీ అధ్యక్షుడు పోగుల నర్సింహా రెడ్డి, బోడుప్పల్ డివిజన్ అధ్యక్షుడు బొమ్మకు కళ్యాణ్, కొత్త కిషోర్ గౌడ్, గుర్రాల వెంకటేశ్ యాదవ్, చీరాల నరసింహ, దానగల యాదగిరి, విశ్వం గుప్త, సుమన్ నాయక్, లోకేష్, హరినాథ్ రెడ్డి, కాలనీవాసులు కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కుషాయిగూడ అభివృద్ధికి మరో ముందడుగు

సీసీ రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభం..

- ఎమ్మెల్యే శ్రీ బండారి లక్ష్మారెడ్డి గారికి కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ తరపున హృదయపూర్వక ధన్యవాదాలు....



నాగారం, నవంబర్ 12:-(జర్నలిస్ట్ డైరీ)

కుషాయిగూడ కాలనీ రోడ్ నంబర్ 2లోని హోల్ సాల్ మార్కెట్ లైన్‌తో పాటు సరస్వతి శిశుమందిర్ పాఠశాల ఎదురుగా ఉన్న వీధిలో నూతన సీసీ రోడ్ల నిర్మాణ పనులు గురువారం ప్రారంభించారు.

కుషాయిగూడ ప్రజలు, స్థానిక వ్యాపారులు ఎదుర్కొంటున్న రోడ్ల సమస్యలను మా వెల్ఫేర్ అసోసియేషన్ తరపున ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి దృష్టికి తీసుకెళ్లగా ఆయన వెంటనే స్పందించి ప్రజల ఇబ్బందులను అర్థం చేసుకుని సీసీ రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించడంతో పాటు పనులు ప్రారంభమయ్యేలా ప్రత్యేక చొరవ చూపారు. ప్రజల విజ్ఞప్తికి సానుకూలంగా స్పందించి, కుషాయిగూడ అభివృద్ధికి సహకరించిన ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అదేవిధంగా రోడ్ల నిర్మాణ పనులను ప్రారంభించిన జిహెచ్ఎంసి అధికారులకు, సహకరిస్తున్న మున్సిపల్ సిబ్బందికి హృదయపూర్వక ధన్యవాదాలు.ప్రజా సమస్యల పరిష్కారం -- కుషాయిగూడ అభివృద్ధే మా లక్ష్యంగా కుషాయిగూడ వెల్ఫేర్ అసోసియేషన్ పనిచేస్తుందని అన్నారు.

ఏపీకి మరో భారీ పెట్టుబడి.. రూ.800 కోట్లతో

ఆస్ట్రోబేస్ రాకెట్ టెస్టింగ్ కేంద్రం విస్తరణ

-ఏపీలో రూ.800 కోట్ల పెట్టుబడికి ఆస్ట్రోబేస్ స్పేస్ ఒప్పందం

-విశాఖ సీఐఐ భాగస్వామ్య సదస్సులో ఏపీఈడీబీతో ఎంఓయూ

-శ్రీ సత్యసాయి జిల్లా తిమ్మ సముద్రంలో 360 ఎకరాలకు కేంద్రం విస్తరణ

-రీయూజబుల్ లాంచ్ వెహికల్స్, హాట్ ఫైర్ పరీక్షల నిర్వహణకు అవకాశం

-ప్రత్యక్షంగా 500 మందికి, పరోక్షంగా 1000 మందికి ఉపాధి

విశాఖపట్నం,ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :

విశాఖపట్నం వేదికగా జరుగుతున్న 31వ సీఐఐ పార్ట్‌నర్‌షిప్ సమ్మిట్ 2026లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి భారీ అంతరిక్ష రంగ పెట్టుబడి లభించింది. ప్రముఖ ప్రైవేట్ స్పేస్ టెక్నాలజీ సంస్థ ఆస్ట్రోబేస్ స్పేస్ టెక్నాలజీస్, రాష్ట్రంలో రాకెట్ టెస్టింగ్, లాంచ్ వెహికల్ అభివృద్ధి మౌలిక వసతులను భారీగా విస్తరించేందుకు రూ.800 కోట్ల పెట్టుబడిని ప్రకటించింది. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ ఎకనామిక్ డెవలప్‌మెంట్ బోర్డ్ తో సంస్థ గురువారం అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది.

రాకెట్ ఇంజిన్ టెస్టింగ్ కేంద్రాన్నిపెద్ద ఎత్తున విస్తరించనున్న సంస్థఈ విస్తరణ ప్రాజెక్టు ద్వారా శ్రీ సత్యసాయి జిల్లా తిమ్మ సముద్రంలో ప్రస్తుతం ఉన్న రాకెట్ ఇంజిన్ టెస్టింగ్ కేంద్రాన్ని సంస్థ మరింత పెద్ద ఎత్తున విస్తరించనుంది. ప్రస్తుతం దాదాపు 22 ఎకరాల్లో ఉన్న ఈ సదుపాయానికి అదనంగా మరో 339 ఎకరాలను చేర్చనున్నారు. దీంతో ఈ టెస్టింగ్ కేంద్రం మొత్తం విస్తీర్ణం సుమారు 360 ఎకరాలకు చేరుకుంటుంది. భారత ప్రైవేట్ అంతరిక్ష రవాణా వ్యవస్థను బలోపేతం చేయడంలో ఈ ప్రాజెక్ట్ కీలక పాత్ర పోషించనుంది.

ఈ విస్తరణ ఒక కీలక మైలురాయి

ఈ పరిణామంపై ఆస్ట్రోబేస్ స్పేస్ టెక్నాలజీస్ సీఈఓ, కో-ఫౌండర్ నీరజ్ ఖండేల్‌వాల్ స్పందిస్తూ.. భారతదేశం నుంచే అత్యాధునిక అంతరిక్ష రవాణా వ్యవస్థలను నిర్మించే తమ ప్రయత్నాలలో ఈ విస్తరణ ఒక కీలక మైలురాయి అని తెలిపారు. విస్తరించిన ఈ మౌలిక వసతుల ద్వారా స్టాటిక్ హాట్-ఫైర్ టెస్టులు, స్టేజ్-లెవల్ హాప్ టెస్టులు వంటి అత్యంత సంక్లిష్టమైన ప్రయోగాలను నిర్వహించవచ్చని ఆయన వివరించారు. అంతేకాకుండా పునర్వినియోగ రాకెట్ టెక్నాలజీ (రీయూజబుల్ లాంచ్ వెహికల్స్) అభివృద్ధిని వేగవంతం చేయడానికి ఇది దోహదపడుతుందని పేర్కొన్నారు. అంతరిక్ష పరిశోధనలు, సాంకేతికతలో భారత్ ఇప్పటికే తన సత్తాను నిరూపించుకుందని, భవిష్యత్తులో ఉపగ్రహాలు, పేలోడ్లను మరింత తరచుగా, విశ్వసనీయంగా నింగిలోకి చేరవేయడమే తదుపరి లక్ష్యమని ఆయన వ్యాఖ్యానించారు.

ఈ ప్రాజెక్టు ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు ఈ ప్రాజెక్టు ద్వారా స్థానికంగా దాదాపు 500 మందికి ప్రత్యక్షంగా, మరో 1,000 మందికి పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. కాగా, బెంగళూరులో ఎవరెస్ట్ ఇంజిన్, ఏబీ220 మీడియం - లిఫ్ట్ లాంచ్ వెహికల్ అభివృద్ధికి అవసరమైన అధునాతన తయారీ యూనిట్ ఏర్పాటు కోసం కర్ణాటకలో రూ.500 కోట్ల పెట్టుబడి ప్రకటించిన కొద్ది రోజుల్లోనే ఆస్ట్రోబేస్ ఈ తాజా ఒప్పందం చేసుకోవడం గమనార్హం.రెండు రోజుల సదస్సు ద్వారా రాష్ట్రానికి దాదాపు రూ.11 లక్షల కోట్ల పెట్టుబడులు,కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ,డిపార్ట్‌మెంట్ ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఇండస్ట్రీ అండ్ ఇంటర్నల్ ట్రేడ్ సంయుక్తంగా ఏపీ ప్రభుత్వ ఆతిథ్యంలో నిర్వహిస్తున్న ఈ రెండు రోజుల సదస్సు ద్వారా రాష్ట్రానికి దాదాపు రూ.11 లక్షల కోట్ల పెట్టుబడులు, 2.5 లక్షల ఉద్యోగాలు వస్తాయని ప్రభుత్వం అంచనా వేస్తోంది

కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కుషాయిగూడలో

నూతన సీసీ రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభం...



నాగారం, నవంబర్ 12:-(జర్నలిస్ట్ డైరీ)

కుషాయిగూడ కాలనీ రోడ్ నంబర్ 2లోని హోల్‌సేల్ మార్కెట్ రోడ్డులో నూతన సీసీ రోడ్ల నిర్మాణ పనులను గురువారం ప్రారంభించడం జరిగింది. ఉప్పల్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ మందుముల పరమేశ్వర్ రెడ్డి ప్రత్యేక చొరవ, సహకారంతో ఈ రోడ్ల నిర్మాణానికి అవసరమైన నిధులు సమకూర్చి, పనులు ప్రారంభమయ్యేలా కృషి చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు సీతారాం రెడ్డి, కాసుల పోచయ్య గౌడ్, శ్వేంకట రెడ్డి, కుషాయిగూడ డివిజన్ ప్రధాన కార్యదర్శి కూరెల్లి రాఘవేంద్ర గౌడ్, వికాస్ రెడ్డి మరియు గోపాల్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు. కుషాయిగూడ ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ చూపిస్తూ, సీసీ రోడ్ల నిర్మాణ పనులకు సహకరించిన మందుముల పరమేశ్వర్ రెడ్డికి హృదయపూర్వక ధన్యవాదాలని

కుషాయిగూడ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కౌకుట్ల ప్రకాష్ రెడ్డి పేర్కొన్నారు.

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

పోలీస్ ఉద్యోగాల అభ్యర్థులు క్రమశిక్షణ, పట్టుదలతో లక్ష్య సాధనకు కృషి చేయాలి

- జిల్లా పాలనాధికారి కుమార్ దీపక్



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ డైరీ) నవంబర్ 12,

పోలీస్ ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న అభ్యర్థులు క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర కృషితో తమ లక్ష్యాలను సాధించాలని జిల్లా పాలనాధికారి కుమార్ దీపక్ తెలిపారు. గురువారం జిల్లా కేంద్రంలోని కాలేజీ రోడ్డులో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పోలీస్ ఉద్యోగాల అభ్యర్థులకు నిర్వహిస్తున్న నిపుణ శిక్షణ కార్యక్రమానికి రామగుండం కమీషనర్ ఆఫ్ పోలీస్ అంబర్ కిషోర్ ఝా, మంచిర్యాల డి.సి.పి. ఎ.భాస్కర్, ఎ.సి.పి. ప్రకాష్ లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గత రెండు నెలలకు పైగా అభ్యర్థులు ఎంతో కష్టపడి శిక్షణ పొందుతున్నారని, శిక్షణలో పాల్గొంటున్న అభ్యర్థులలో అధిక శాతం మంది ప్రిలిమినరీ పరీక్షలో అర్హత సాధించే అవకాశం ఉందని పోలీస్ అధికారులు అంచనా వేస్తున్నారని తెలిపారు. ప్రిలిమినరీ పరీక్షను అధిగమించిన తరువాత అభ్యర్థులలో ఆత్మవిశ్వాసం, ప్రేరణ, లక్ష్యసాధన పట్ల నిబద్ధత మరింత పెరుగుతాయని తెలిపారు. పరీక్ష పూర్తయ్యే వరకు ఇదే ఉత్సాహం, పట్టుదలతో చదువును కొనసాగించాలని సూచించారు. ప్రిలిమినరీ పరీక్ష అనంతరం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అభ్యర్థులకు శారీరక దృఢత్వ పరీక్షలకు సంబంధించిన శిక్షణ కూడా అందించడం జరుగుతుందని తెలిపారు. ఫిజికల్ టెస్టులతో పాటు అవసరమైన ప్రాక్టీస్, నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ఒకే ఉద్యోగంపై ఆధారపడకుండా కానిస్టేబుల్, ఎస్.ఐ. ఉద్యోగాలతో పాటు అర్హతను బట్టి బ్యాంకింగ్, రైల్వే, డి.ఎస్.సి. తదితర పోటీ పరీక్షలకు కూడా సిద్ధం కావాలని సూచించారు. వివిధ పోటీ పరీక్షలకు సంబంధించిన సబ్జెక్టులు, పరీక్షా విధానాలలో సారూప్యత ఉంటుందని, ప్రస్తుత శిక్షణ ద్వారా పొందిన పరిజ్ఞానం ఇతర ఉద్యోగ పరీక్షలకు ఉపయోగపడుతుందని తెలిపారు. ఒక ఉద్యోగాన్ని సాధించిన తరువాత బాధ్యతాయుతంగా, పూర్తి నిబద్ధతతో విధులు నిర్వహించాలని తెలియజేశారు. ఈ శిక్షణ కార్యక్రమానికి సుమారు 400 మంది అభ్యర్థులు క్రమం తప్పకుండా హాజరవుతుండటం అభినందనీయమని తెలిపారు. ఉద్యోగం సాధించడం మాత్రమే కాకుండా, ఈ శిక్షణ ద్వారా క్రమశిక్షణ, సమయపాలన, కష్టపడే తత్వం, సామాజిక బాధ్యత వంటి మంచి లక్షణాలు అలవడతాయని తెలిపారు. ప్రభుత్వ, ప్రైవేట్, ఇతర ఏ రంగంలో పని చేసినా ఈ లక్షణాలు జీవితంలో విజయానికి దోహదపడతాయని పేర్కొన్నారు. పోలీస్ శాఖలో విధులు నిర్వహించడం ఎంతో బాధ్యతతో కూడుకున్నదని, పోలీసులు 24 గంటలు, ఏడాది పొడవునా ప్రజల భద్రత కోసం సేవలందిస్తారని గుర్తు చేశారు. వారి సేవాభావం, త్యాగనిరతి ప్రతి ఒక్కరికీ ఆదర్శమని తెలిపారు.కమీషనర్ ఆఫ్ పోలీస్ మాట్లాడుతూ శిక్షణ ప్రారంభానికి, ఇప్పటికి అభ్యర్థుల ప్రవర్తన, వస్త్రధారణ, సమయపాలన, క్రమశిక్షణలో గణనీయమైన మార్పు కనిపిస్తుందని తెలిపారు. అభ్యర్థులను చూస్తుంటే ఇప్పటికే పోలీస్, ఆర్మీ నియామకాలకు సిద్ధమైన వారిలా కనిపిస్తున్నారని, వారి క్రమశిక్షణ, అంకితభావం తనకు ఎంతో ఆనందాన్ని కలిగించాయని తెలిపారు. కేవలం ఉద్యోగం సాధించడమే లక్ష్యంగా కాకుండా, మెరిట్ జాబితాలో అత్యుత్తమ స్థానం సాధించాలనే సంకల్పంతో ముందుకు సాగాలని సూచించారు. కానిస్టేబుల్ ఉద్యోగం ఒక ప్రారంభం మాత్రమేనని, ఉద్యోగంలో చేరిన తరువాత తమ ప్రతిభ, కృషి, పనితీరుతో ఉన్నత పదవులను సాధించే అవకాశాలు ఉంటాయని వివరించారు. శిక్షణలో భాగంగా గణితం, రీజనింగ్, భాషా పరిజ్ఞానం వంటి అంశాలలో అభ్యర్థులు పొందిన పునాది ఇతర పోటీ పరీక్షలకు ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. తమపై తమకు నమ్మకం ఉంచుకోవాలని, తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు పెట్టుకున్న ఆశలు, నమ్మకాన్ని స్ఫూర్తిగా తీసుకొని లక్ష్య సాధన కోసం కష్టపడాలని సూచించారు. విజయం సాధించే క్రమంలో ఎదురయ్యే ఇబ్బందులను ఆత్మవిశ్వాసంతో అధిగమించాలని తెలిపారు. అభ్యర్థులకు విద్యాబోధనతో పాటు మంచి వ్యక్తిత్వం, నడవడిక, క్రమశిక్షణను నేర్పిస్తున్న రిజర్వ్ ఇన్స్పెక్టర్ సంపత్, వారి బృంద సభ్యులకు కృషి అభినందనీయమని తెలిపారు. ఈ శిక్షణ ద్వారా అభ్యర్థులు ఏ రంగంలోకి వెళ్లినా విజయవంతంగా రాణించగలరని ఆకాంక్షించారు.

అనంతరం శిక్షణ అభ్యర్థులకు ఉచిత కోచింగ్ మెటీరియల్ ను అందజేశారు.

ఈ కార్యక్రమంలో రిజర్వ్ ఇన్స్పెక్టర్ సంపత్, పోలీస్ అధికారులు, శిక్షణ బృంద సభ్యులు, అభ్యర్థులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మల్లారెడ్డి ఆధ్వర్యంలో మంత్రి శ్రీధర్ బాబును కలిసిన డంపింగ్ యార్డ్ ప్రజలు....



నాగారం, నవంబర్ 12:-(జర్నలిస్ట్ డైరీ)

మేడ్చల్ నియోజకవర్గం జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో పలు కాలనీల సమస్యలను మరియు జవహర్ డంపింగ్ యార్డ్ సమస్య ను ఇంచార్జ్ మంత్రివర్యులు దుద్దిల్ల శ్రీధర్ బాబుని హైదరాబాద్ లోని వారి క్యాంపు కార్యాలయంలో గురువారం కలిసి జవహర్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ సమస్యలను వారికీ వివరించడం జరిగింది.

డ్రైనేజి రోడ్ సమస్యలను పరిష్కారం కొరకు ప్రత్యేక నిధులను మంజూరు చేయాలని కోరడమైనది. అందుకు మంత్రి శ్రీధర్ బాబు సానుకూలంగా స్పందించి జవహర్ నగర్ డివిజన్ సమస్యలను, డంపింగ్ యార్డ్ సమస్యను పరిష్కారిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ కావ్య, దమ్మాయిగూడ మాజీ చైర్పర్సన్ ప్రణిత శ్రీకాంత్ గౌడ్, మాజీ కార్పొరేటర్లు, సంగీత రాజశేఖర్, వాణి శ్రీనివాస్ రెడ్డి, డంపింగ్ యార్డ్ జేఏసీ సభ్యులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మల్లారెడ్డి ఆధ్వర్యంలో మంత్రి శ్రీధర్ బాబు ను కలిసిన 40కాలనీల ప్రతినిధులు..



నాగారం, నవంబర్ 12:-(జర్నలిస్ట్ డైరీ)

మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి నాగారం మున్సిపల్ పరిధిలో పలు కాలనీల సందర్శించిన సందర్భంగా ఆయా కాలనీ కాలనీ సమస్యలను ఇంచార్జ్ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబుని వారి క్యాంపు కార్యాలయంలో కాలనీ వాసులతో పాటు మర్యాద పూర్వకంగా కలిసి నాగారం మున్సిపాలిటీ 40కాలనీల సమస్యలను గురువారం వారికీ వివరించడం జరిగింది.

డ్రైనేజి రోడ్ సమస్యలను పరిష్కారం కొరకు నిధులను మంజూరు చేయాలని కోరడమైనది.అందుకు మంత్రివర్యులు శ్రీధర్ బాబు సానుకూలంగా స్పందించి ఎంఎంసి కమిషనర్ కు ఫోన్ చేసి సమస్యలను పరిష్కారించాలని ఆదేశించారు. కాలనీ సమస్యలను పరిష్కారం కొరకు నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.

స్థానిక ఎన్నికల్లో ఓటములపై లోకేశ్ సమీక్ష..
4 అంశాలపై నివేదికలకు ఆదేశం!

-స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ఓటములపై నారా లోకేశ్ దృష్టి

-నాలుగు అంశాల ఆధారంగా కారణాలను తెలియజేయాలని పార్టీ నేతలకు సూచన

-క్యాడర్ అభిప్రాయాలకు విరుద్ధంగా అభ్యర్థుల ఎంపికతో ఓడిన స్థానాలేంటో గుర్తించాలన్న మంత్రి

-ఎమ్మెల్యేల పనితీరు, కూటమి సమన్వయ లోపం, వైసీపీ సంస్థాగత బలంపైనా నివేదిక కోరిన లోకేశ్

-76 జడ్పీటీసీ, 1,700 ఎంపీటీసీ స్థానాల్లో ఓటమికి కారణాలను విశ్లేషించాలని సూచన



అమరావతి, ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :

ఏపీ స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి ఘన విజయం సాధించినప్పటికీ.. కొన్ని చోట్ల ఎదురైన పరాజయాలపై మంత్రి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ దృష్టి సారించారు. ఓటమికి దారితీసిన కారణాలను గుర్తించి, భవిష్యత్తులో అలాంటి పొరపాట్లు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని భావిస్తున్నారు. ఇందులో భాగంగా పార్టీ నేతల నుంచి నాలుగు అంశాలపై నివేదికలు కోరినట్లు సమాచారం.

ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో వైసీపీ నుంచి పలు చోట్ల గట్టి పోటీ

మున్సిపల్ ఎన్నికల్లో కూటమి మంచి ఫలితాలు సాధించింది. అయితే ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల దగ్గరకు వచ్చేసరికి వైసీపీ నుంచి పలు చోట్ల గట్టి పోటీ ఎదురైంది. ఫలితంగా 76 జడ్పీటీసీ స్థానాలతో పాటు 1,700 ఎంపీటీసీ స్థానాల్లో కూటమి ఓటమి చవిచూసింది. ఈ పరాజయాలకు కారణాలేంటన్నది తెలుసుకునేందుకు లోకేశ్ సమీక్షకు సిద్ధమయ్యారు.

ఓటమికి దారితీసిన అంశాలను నాలుగు కేటగిరీలుగా విభజించి అరా..

ఓటమికి దారితీసిన అంశాలను నాలుగు కేటగిరీలుగా విభజించి వివరాలు సేకరించాలని పార్టీ నేతలను కోరారు. తొలుత క్యాడర్ అభిప్రాయాలకు విరుద్ధంగా అభ్యర్థులను ఎంపిక చేయడం వల్ల ఓడిపోయిన స్థానాలను గుర్తించాలని సూచించారు. ఎమ్మెల్యేల పనితీరు సరిగా లేక పరాజయం ఎదురైన స్థానాలు రెండో విభాగం కింద విభజించారు. కూటమి పార్టీల మధ్య సమన్వయ లోపంతో ఓడిపోయిన స్థానాలు మూడో విభాగంగా గుర్తించాలన్నారు. వైసీపీకి సంస్థాగతంగా బలం ఉండటం వల్ల ఓటమి ఎదురైన స్థానాలు నాలుగో విభాగంగా నమోదు చేయాలని సూచించారు.

పరిషత్ ఎన్నికల్లో కూటమి పార్టీల మధ్య సీట్ల సర్దుబాటులో లోపాలు

పరిషత్ ఎన్నికల్లో కూటమి ఓటమికి ప్రధానంగా రెండు కారణాలు ఉన్నట్లు విశ్లేషణలు చెబుతున్నాయి. కూటమి పార్టీల మధ్య సీట్ల సర్దుబాటులో లోపాలు ఒక కారణమని తెలుస్తోంది. గెలిచే అవకాశమున్న పార్టీకి కాకుండా, కోటా ప్రాతిపదికన బలహీనమైన పార్టీకి కొన్ని స్థానాలు కేటాయించడం, బలహీన అభ్యర్థులను బరిలోకి దించడం వంటివి ప్రభావం చూపినట్లు పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. మరోవైపు వైసీపీ నుంచి ఇంతటి పోటీ ఎదురవుతుందని కూటమి అంచనా వేయలేకపోయిందని, ఆ పార్టీ క్షేత్రస్థాయి బలం కూడా కొన్ని చోట్ల ఫలితాలను ప్రభావితం చేసిందని విశ్లేషణలు పేర్కొంటున్నాయి.నాలుగు అంశాలపై నివేదికలు అందిన తర్వాత లోకేశ్ వాటిని పరిశీలించి, లోపాలను సరిదిద్దే చర్యలు చేపట్టే అవకాశం ఉంది

జన సైనికులకు వైసీపీ లీగల్ టీమ్ స్ట్రాంగ్ వార్నింగ్!

-జగన్ కుటుంబంపై అసభ్య వ్యాఖ్యలు చేస్తే చర్యలు తప్పవన్న వైసీపీ

-సోషల్ మీడియాలో హద్దులు దాటుతున్నారంటూ జనసేన శ్రేణులపై ఆగ్రహం

-ఎక్స్ వేదికగా అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తి గుర్తింపు

-గోవాడ రాఘవేంద్ర నాయుడుపై చట్టపరమైన చర్యలకు నిర్ణయం

-అసభ్యకర ఆడియోల ప్రచారాన్ని తీవ్రంగా పరిగణిస్తున్న పార్టీ లీగల్ సెల్



అమరావతి, ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :

వైసీపీ అధినేత జగన్, ఆయన కుటుంబ సభ్యులపై సామాజిక మాధ్యమాల్లో అసభ్యకర రీతిలో వ్యాఖ్యలు చేస్తున్నారంటూ జనసైనికులపై వైసీపీ లీగల్ సెల్ మండిపడింది. పరిమితులు దాటి ఇష్టానుసారంగా వ్యవహరిస్తే చట్టపరమైన కఠిన చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుందని గట్టి హెచ్చరికలు జారీ చేసింది.పవన్ కల్యాణ్ మూడో భార్యకు విడాకుల నేపథ్యంలో, జనసేన కార్యకర్తలు సోషల్ మీడియా వేదికగా అన్ని రకాల హద్దులు దాటి ప్రవర్తిస్తున్నారని లీగల్ సెల్ ఆరోపించింది. జగన్, ఆయన కుటుంబ సభ్యులను లక్ష్యంగా చేసుకుని అత్యంత జుగుప్సాకరమైన, దారుణమైన భాషను ఉపయోగిస్తున్నారని తెలిపింది. అంతటితో ఆగకుండా, ఆ వ్యాఖ్యలను రికార్డు చేసి వివిధ సామాజిక మాధ్యమాల్లో ఉద్దేశపూర్వకంగా ప్రచారం చేస్తున్నారని పేర్కొంది.

అత్యంత తీవ్రంగా పరిగణ ఈ పరిణామాలను పార్టీ లీగల్ విభాగం అత్యంత తీవ్రంగా పరిగణిస్తోందని స్పష్టం చేసింది. అందిన ప్రాథమిక సమాచారం ప్రకారం, నిన్న ఎక్స్ (ట్విట్టర్) వేదికగా 'స్పేస్' నిర్వహించి జగన్ కుటుంబంపై అనుచిత వ్యాఖ్యలు చేసిన వ్యక్తిని గోవాడ రాఘవేంద్ర నాయుడుగా గుర్తించినట్లు వెల్లడించింది.

సదరు వ్యక్తి ఏGlass19Mar, @TYSON21AP, @werty1234up వంటి వివిధ ఖాతాల పేర్లతో కార్యకలాపాలు సాగిస్తున్నట్లు గుర్తించామని, అతనిపై త్వరలోనే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని లీగల్ సెల్ స్పష్టం చేసింది. భావప్రకటన స్వేచ్ఛ పేరుతో వ్యక్తిగత దూషణలకు దిగడం, అసభ్యకర పోస్టులతో సమాజంలో విషం చిమ్మే ప్రయత్నం చేస్తే సహించేది లేదని వైఎస్సార్సీపీ లీగల్ విభాగం హెచ్చరించింది

యాద్గార్పల్లి డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో విద్యుత్ కష్టాలు...

ఉదయం నుంచి అంధకారంలోనే పేదల నివాసాలు..
అధికారుల తీరుపై స్థానికుల ఆగ్రహం...



నాగారం, నవంబర్ 12:-(జర్నలిస్ట్ డైరీ)

మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కీసర సర్కిల్ పరిధిలోని యాద్గార్పల్లి గ్రామ డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గురువారం ఉదయం నుంచి విద్యుత్ లేకపోవడంతో కాలనీ వాసులు అంధకారంలోనే కాలం వెళ్లదీస్తున్నారు.

స్థానికుల కథనం ప్రకారం.. ఉదయం కీసర విద్యుత్ శాఖ ఏఈ మురళి వచ్చి విద్యుత్ సరఫరాను నిలిపివేసినట్లు చెబుతున్నారు. అయితే ముందస్తు సమాచారం ఇవ్వకుండా విద్యుత్ నిలిపివేయడంపై కాలనీవాసులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో విష పురుగులు, పాముల సంచారం ఉంటే ఎలా గుర్తించాలని మహిళలు, వృద్ధులు, చిన్నారుల భద్రతపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.పేదలకు ప్రభుత్వం అందించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు నేడు విద్యుత్ లేక చీకటిమయంగా మారాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అసలు విద్యుత్ ఎందుకు నిలిపివేశారని వారు ప్రశ్నించారు. ముందస్తు సమాచారం ఎందుకు ఇవ్వలేదు? ప్రజలకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయకుండా సరఫరా నిలిపివేయడం ఎంతవరకు సమంజసమని స్థానికులు ప్రశ్నిస్తున్నారు.

ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించాలని, ఈ వ్యవహారంపై విచారణ జరిపి బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని యాద్గార్పల్లి డబుల్ బెడ్‌రూమ్ కాలనీ వాసులు డిమాండ్ చేస్తున్నారు.

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

మంత్రి శ్రీధర్ బాబుని కలిసిన నాగారం, రాంపల్లి కాలనీల అసోసియేషన్ సభ్యులు....



నాగారం, నవంబర్ 12:-(జర్నలిస్ట్ డైరీ)

నాగారం, రాంపల్లి ఆల్ కాలనీల అసోసియేషన్ ప్రతినిధులు ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబుని గురువారం కలిసి నాగారం, రాంపల్లి పరిధిలోని అన్ని కాలనీలు ఎదుర్కొంటున్న ప్రధాన మౌలిక వసతుల సమస్యలపై చర్చించడం జరిగింది. ప్రధానంగా చర్చించిన అంశాలు:


1.అన్ని కాలనీలలో భూగర్భ డ్రైనేజీ పనులు.

2.సీసీ రోడ్ల నిర్మాణం మరియు పెండింగ్‌లో ఉన్న పనులు.

3.దీర్ఘకాలంగా పరిష్కారం కాని కాలనీల మౌలిక వసతుల సమస్యలకు శాశ్వత పరిష్కారం. ఈ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చొరవ తీసుకొని, వీలైనంత త్వరగా పనులు ప్రారంభించి పూర్తి చేయాలని మంత్రిని కోరడం జరిగిందని ప్రతినిధులు తెలిపారు. ప్రతి కాలనీ అభివృద్ధే మన లక్ష్యంగా ప్రతి సమస్య పరిష్కారమే మన బాధ్యతగా పనిచేస్తామని ప్రతినిధులు తెలిపారు.

ప్రభుత్వ మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలి

జిల్లా అదనపు పాలనాధికారి (రెవెన్యూ) వి.రాములు



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ డైరీ) నవంబర్ 12,

వానాకాలం 2026-27 సీజన్‌కు సంబంధించి ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు ప్రభుత్వ మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటించాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వి.రాములు తెలిపారు. గురువారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని అదనపు కలెక్టర్ ఛాంబర్ లో జిల్లాలోని అన్ని ధాన్యం కొనుగోలు కేంద్రాల హెచ్ఓడీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు పాలనాధికారి మాట్లాడుతూ వానాకాలం 2026-27 సీజన్‌కు సంబంధించి ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలు, సూచనలను ప్రతి పి.పి.సి. హెచ్ ఓ డి తప్పనిసరిగా పాటించాలని ఆదేశించారు. పి సి ఎస్ ఎ పి రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఎలాంటి జాప్యం లేకుండా పూర్తి చేయడంతో పాటు, నిర్దేశించిన 16 ప్రశ్నలకు సంబంధించిన వివరాల నమోదు ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి ప్రభుత్వ నిబంధనలను పకడ్బందీగా అమలు చేస్తూ, సంబంధిత అధికారులు సమన్వయంతో పని చేయాలని, కొనుగోలు ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి వేణుగోపాల్, జిల్లా మేనేజర్ శ్రీకళ,డి.పి.ఎం., మెప్మా పి.డి., ఇన్చార్జి జిల్లా సహకార అధికారి, డి.సి.ఎం.ఎస్. మేనేజర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విశాఖలో సీఐఐ సమ్మిట్ ఘనంగా ప్రారంభం.. రూ. 12 లక్షల కోట్ల పెట్టుబడులే లక్ష్యం

-విశాఖలోని ఏయూ మైదానంలో ప్రారంభమైన సీఐఐ సదస్సు
-సదస్సులో పాల్గొన్న చంద్రబాబు, పీయూష్ గోయల్, పవన్ కల్యాణ్, నారా లోకేశ్
-సుమారు రూ.12.14 లక్షల కోట్ల పెట్టుబడులతో 141 ఒప్పందాలకు రంగం సిద్ధం



విశాఖపట్నం,ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :

విశాఖపట్నంలో 31వ సీఐఐ భాగస్వామ్య సదస్సు ఘనంగా ప్రారంభమైంది. ఆంధ్ర విశ్వవిద్యాలయం (ఏయూ) ఇంజినీరింగ్ కళాశాల మైదానంలో రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సులో కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ పాల్గొన్నారు. వీరితో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు, ప్రపంచవ్యాప్తంగా దాదాపు 59 దేశాలకు చెందిన పారిశ్రామిక ప్రతినిధులు, అంతర్జాతీయ ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు.రాష్ట్రానికి భారీ ఎత్తున పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా సదస్సు రాష్ట్రానికి భారీ ఎత్తున పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ సదస్సును నిర్వహిస్తోంది. ఈ రెండు రోజుల సదస్సులో వివిధ రంగాలకు చెందిన ప్రముఖ సంస్థలతో ఏపీ ప్రభుత్వం 141 కీలక అవగాహన ఒప్పందాలు కుదుర్చుకోనుంది. వీటి ద్వారా రాష్ట్రానికి సుమారు రూ.12.14 లక్షల కోట్ల విలువైన పెట్టుబడులు వస్తాయని, తద్వారా దాదాపు 2.46 లక్షల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని ప్రభుత్వం అంచనా వేస్తోంది.

పవన్ కల్యాణ్‌తో నారా లోకేశ్ మర్యాదపూర్వకంగా భేటీ

మరోవైపు సదస్సు ప్రారంభానికి ముందు పవన్ కల్యాణ్‌తో నారా లోకేశ్ మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొస్తున్న పలువురు ఇన్వెస్టర్ల వివరాలను లోకేశ్ ఈ సందర్భంగా పవన్‌కు వివరించారు. రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధికి చొరవ చూపుతున్న లోకేశ్‌ను పవన్ అభినందిస్తూ, రాబోయే రోజుల్లోనూ ఇదే ఉత్సాహంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు. పారిశ్రామిక వృద్ధి, నూతన సాంకేతికతల భాగస్వామ్యంతో ఏపీని గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ హబ్‌గా తీర్చిదిద్దడమే ఈ సదస్సు ప్రధాన ఉద్దేశం

మార్కాపురం జిల్లాలో నగర పంచాయతీ, గ్రామ పంచాయతీ ఎన్నికలకు సమాయత్తం

-ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా నిర్వహించాలి
-సమస్యాత్మక ప్రాంతాల్లో పటిష్ట భద్రత ఏర్పాటు చేయాలి
-కలెక్టర్, ఎస్పీకి రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ప్రత్యేక ఆదేశాలు



మార్కాపురం,జిల్లా బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :

రాష్ట్రంలో పట్టణ స్థానిక సంస్థలు, గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లపై రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా అన్ని జిల్లాల కలెక్టర్లు, ఎస్పీలతో గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్నికల నిర్వహణకు సంబంధించి జిల్లా వారీగా సన్నద్ధత, పరిపాలనా ఏర్పాట్లు, శాంతిభద్రతల పరిరక్షణ తదితర అంశాలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఎన్నికల ప్రక్రియ స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా, ప్రశాంత వాతావరణంలో జరిగేలా సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

పొదిలి నగర పంచాయతీకి ఎన్నికలు

రాష్ట్ర వ్యాప్తంగా 23 పట్టణ స్థానిక సంస్థల నిర్వహణకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారిక నోటిఫికేషన్ విడుదల చేసింది. మార్కాపురం జిల్లాలోని పొదిలి నగర పంచాయతీకి కూడా ఎన్నికలు జరగనున్నాయి. నవంబర్ 14 నుంచి 16వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరించనుండగా.. నవంబర్ 17న నామినేషన్ల పరిశీలన జరగనుంది. నవంబర్ 19వ తేదీ అభ్యర్థులు తమ నామినేషన్లు ఉపసంహరించుకోవచ్చు. నవంబర్ 26న పోలింగ్ జరగనుండగా.. నవంబర్ 30వ తేదీ ఓట్ల లెక్కింపు చేపట్టి ఫలితాలను ప్రకటిస్తారు.

మూడు దశల్లో పంచాయతీ ఎన్నికలు

రాష్ట్ర వ్యాప్తంగా మూడు దశల్లో పంచాయతీ ఎన్నికలు నిర్వహించనున్నట్లు రాష్ట్ర ఎన్నికల కమిషనర్ అనిల్ చంద్ర పునేఠా వెల్లడించారు. నవంబర్ 13న మొదటి దశ, నవంబర్ 16న రెండో దశ, నవంబర్ 19న మూడో దశ పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ విడుదల కానుంది.

మొదటి దశ పంచాయతీలకు నవంబర్ 26వ తేదీన ఎన్నికలు

మొదటి దశ పంచాయతీలకు నవంబర్ 26వ తేదీన ఎన్నికలు జరగనుండగా.. రెండో దశ పంచాయతీలకు నవంబర్ 29న ఎన్నికలు జరగనున్నాయి. చివరి దశ పంచాయతీ ఎన్నికలు డిసెంబర్ 2వ తేదీ జరగనున్నట్లు రాష్ట్ర ఎన్నికల కమిషన్ వెల్లడించింది. ఈ పంచాయతీ ఎన్నికలకు సంబంధించి రెండు, మూడు పంచాయతీలను ఒక క్లస్టర్‌గా తీసుకుని నామినేషన్లు స్వీకరించనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

తన కొడుకుని అరెస్ట్ చేయవద్దంటూ ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్ మహిళా పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యాయత్నం

జర్నలిస్ట్ డైరీ ఎల్బీనగర్..



ఆటో డ్రైవర్‌పై కత్తితో దాడి చేసి తప్పించుకుని తిరుగుతున్న వ్యక్తిని ఎల్బీనగర్ పోలీస్‌లు గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు చేరుకున్నారు. ఎల్బీనగర్ పోలీస్‌లు తెలిపిన వివరాల ప్రకారం.. ఆగస్టు 19వ తేదీన సంతోష నగర్ ఒవైసీ హాస్పిటల్ పక్కన నివాసం ఉండే ఎండీ. ఇమ్రోజ్ క్యాబ్ డ్రైవర్గా పనిచేస్తున్నాడు. ఆగస్టు 19 వతేదీన తెల్లవారు జామున 2:30 గంటలకు పహాడీషరీఫ్‌కు చెందిన తన స్నేహితుడు రహ్మత్ కలిసి ఒవైసీ హాస్పిటల్ పారి నుండి ఎల్బీనగర్ చౌరస్తాకు వెళుండగా ఎల్బీనగర్ బస్ స్టాప్ వైపు యు-టర్న్ తీసుకుంటున్న సమయంలో ఆటోలో వచ్చిన నలుగురు గుర్తు తెలియని వక్తులు వచ్చిన వారు ఆకారణంగా రహ్మత్‌పై కత్తితో దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరుకు కేసు నమోదు చేసుకున్న ఎల్బీనగర్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ మేరకు పోలీసులు కత్తితో దాడి చేసి తప్పించుకుని తిరుగుతున్న నవీన్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించేందుకు ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు.... కొడుకును అరెస్టు చేయొద్దు అంటూ.. ఎల్బీనగర్ పీఎస్‌లో పెట్రోల్ పోసుకుని మహిళ ఆత్మహత్యాయత్నం..

ఆటో డ్రైవర్‌పై కత్తితో దాడి చేసిన కేసులో నవీన్‌ను అరెస్టు చేసిన విషయం తెలుసుకున్న నందనవనంకు చెందిన నవీను వాళ్ల అమ్మ సునీత వారి కుటుంబ సభ్యులతో ఎల్బీనగర్ పోలీస్ స్టేషన్‌కు గురువారం మధ్యాహ్నం వచ్చింది. ఆమె అక్కడ పోలీసులను చూసి పోలీస్ స్టేషన్ ఆవరణలో ఆందోళనకు దిగింది. దాడికి వారి అందరినీ అరెస్టు చేయడానికి తన కుమారుడి ఒక్కడినే ఎలా అరెస్టు చేస్తారంటూ పోలీసులతో చూషణకు దిగింది. తన కుమారుడిని అరెస్టు చేయవద్దంటూ పోలీస్ స్టేషన్ ఆవరణలో హంగామా సృష్టించింది. తను ఇక్కడే చనిపోతానని చెప్పి బయటకు వెళ్లి బాటిల్లో పెట్రోల్ తెచ్చుకుంది. స్టేషన్ వచ్చి తన కుమారుడిని బయటకు పంపించాలని డిమాండ్ చేస్తూ తన వెంట తెచ్చుకున్న పెట్రోల్ ను ఇంటిపై పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. అక్కడే విధుల్లో ఉన్న పోలీసులు అప్రమత్తమయ్యారు. ఆమె వద్ద ఉన్న పెట్రోల్ బాటిల్ను స్వాధీనం చేసుకున్న మహిళకు ఎలాంటి ప్రమాదం జరగకుండా చర్యలు తీసుకున్నారు. పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉన్న నీళ్లు ఆమె పోసి పెట్రోల్ అనవాళు లేకుండా చేశారు. అక్కడ ఉన్న పోలీసులు సమయస్ఫూర్తితో మహిళకు ఎలాంటి ప్రమాదం జరగకుండా చర్యలు తీసుకున్నారు. ఈ సంఘటనతో పోలీస్ స్టేషన్ అవరణలో ఒక్కసారిగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఈ విషయం తెలుసుకున్న ఎల్బీనగర్ ఇన్స్పెక్టర్ వెంకటేశం అక్కడకు వచ్చి సంఘటన సునీతతో మాట్లాడాడు. సమస్యను పెద్దది కాకుండా చూసి ఆమెను ఆసుపత్రికి తరలించాలని సూచించాడు. మద్యం మత్తులో సునీత హంగామ సృష్టించాడు. అనంతరం సునీతను అంబులెన్స్ హాస్పిటల్ తరలిచారు..

చుక్కా రామయ్యను కలిసిన హైదరాబాద్ ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి రామ్మోహన్ రెడ్డి....



నాగారం, నవంబర్ 12:-(జర్నలిస్ట్ డైరీ)

తెలుగు విద్యార్థులను ఐఐటీ స్థాయి విద్యావంతులుగా తీర్చిదిద్ది, వేలాది మంది విద్యార్థుల జీవితాల్లో విద్యాజ్యోతులు వెలిగించిన ప్రముఖ విద్యావేత్త, మాజీ ఎమ్మెల్సీ చుక్కా రామయ్యని కాంగ్రెస్ పార్టీ ఎమ్మెల్సీ అభ్యర్థి శ్రీ సామ రామ్మోహన్ రెడ్డి గురువారం మర్యాదపూర్వకంగా కలిసి వారి ఆశీర్వచనాలు తీసుకున్నారు. విద్యారంగానికి విశేష సేవలందించిన చుక్కా రామయ్య సలహాలు, ఆశీస్సులు పొందడం ఈ సందర్భంగా ప్రత్యేకతను సంతరించుకుందని ఆయన తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం...

నాగారం, నవంబర్ 12:-(జర్నలిస్ట్ డైరీ)

నాగారం, కీసర సబ్‌స్టేషన్ ల పరిధిలో
నేడు 13 శుక్రవారం

చెట్ల కొమ్మల తొలగింపు పనుల కారణంగా క్రింది విద్యుత్ ఫీడర్ల పరిధిలో పేర్కొన్న సమయాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని కీసర విద్యుత్ ఎఈ ఎస్ మురళీకృష్ణ తెలిపారు.

1) 11కెవి అంకిరెడ్డిపల్లి ఫీడర్
సబ్‌స్టేషన్: కీసర సబ్‌స్టేషన్ పరిధిలో
ఉదయం 11:00 గంటల నుండి మధ్యాహ్నం 01:00 గంటల వరకు అంతరాయం ఉంటుందని తెలిపారు.
లివిద్యుత్ సరఫరా నిలిచే ప్రాంతాలు: అంకిరెడ్డిపల్లి, శివాజీనగర్, కీసరగుట్ట రోడ్డు, సినిమా థియేటర్, మల్లికార్జున నగర్, విఆర్ఆర్ వెంచర్, లలిత ఫంక్షన్ హాల్, రిజిస్టర్ ఆఫీస్, చంద్రగిరి కాలనీ, కీసర గ్రామం ఏజీఎల్.

2) 11కెవి బోగారం ఫీడర్,
కీసర సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం 11:00 గంటల నుండి మధ్యాహ్నం 01:00 గంటల వరకు. లివిద్యుత్ సరఫరా నిలిచే ప్రాంతాలు: వెంకట్ రెడ్డి నగర్, రెడ్డి గూడెం, పీఎన్ఆర్ కాలనీ, కీసర హెచ్‌పీ పెట్రోల్ పంప్, మేఘన ఫంక్షన్ హాల్.

3) 11కెవి పెద్దమ్మ చెరువు ఫీడర్ అంకిరెడ్డిపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో మధ్యాహ్నం 02:00 గంటల నుండి సాయంత్రం 04:00 గంటల వరకు.
లివిద్యుత్ సరఫరా నిలిచే ప్రాంతాలు: ఈ-పవర్, బీసీ హాస్టల్, కీసరగుట్ట, ఏజీఎల్ సర్వీస్.
కావున ఆయా ప్రాంతాల ప్రజలు విద్యుత్ అంతరాయాన్ని గమనించి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన కోరారు.

వయోజన విద్యాశాఖ జిల్లా ఇన్‌చార్జిగా ఏ. పురుషోత్తం బాధ్యతల స్వీకరణ



ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో (జర్నలిస్ట్ డైరీ) నవంబర్ 12,

మంచిర్యాల జిల్లా వయోజన విద్యాశాఖ జిల్లా ఇన్‌చార్జిగా నూతనంగా నియమితులైన ఏ. పురుషోత్తం గురువారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం జిల్లా పాలనాధికారి కుమార్ దీపక్ ను మర్యాదపూర్వకంగా కలిసి తన నియామకం గురించి తెలియజేశారు.ఈ సందర్భంగా ఏ. పురుషోత్తం మాట్లాడుతూ జిల్లాలో వయోజన విద్యా కార్యక్రమాలను మరింత సమర్థవంతంగా అమలు చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మార్గదర్శకాల మేరకు ఉల్లాస్ (ULLAS) -- నవ భారత్ సాక్షరత కార్యక్రమం ద్వారా నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడంతో పాటు, ప్రజల్లో విద్య పట్ల అవగాహన కల్పించేందుకు ప్రత్యేక చర్యలు చేపడతానన్నారు. సంబంధిత శాఖల సమన్వయంతో కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రిసోర్స్ పర్సన్లు ఏ. సత్యనారాయణమూర్తి, ఎం. సుమన్ తదితరులు పాల్గొని నూతన జిల్లా ఇన్‌చార్జి ఏ. పురుషోత్తంకు శుభాకాంక్షలు తెలియజేశారు.

జర్నలిస్ట్ డైరీ
తెలుగు దినపత్రిక

సీఐఐ సదస్సులో ఏపీపై పారిశ్రామికవేత్తల ప్రశంసల జల్లు..

కియా రూ. 18 వేల కోట్ల పెట్టుబడి ప్రకటన

-ఏపీలో రూ. 18 వేల కోట్లతో ప్లాంట్ విస్తరణకు కియా నిర్ణయం

-ఇది 'ఈజ్' కాదు, 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' అని జీఎంఆర్ ప్రశంస

-భోగాపురం విమానాశ్రయం ఏపీకి ఎకనామిక్ ఇంజన్‌గా మారుతుందన్న జీఎం రావు

-మహారాష్ట్ర నా జన్మభూమి అయితే, ఏపీ నా భాగ్య భూమి అన్న సాగర్ డిఫెన్స్ సీఈఓ

-సీఐఐ సదస్సు వేదికగా ఏపీ ప్రభుత్వ విధానాలపై పారిశ్రామికవేత్తల కితాబు



విశాఖపట్నం,ఏపీ బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :
పారిశ్రామిక రంగంలో ఆంధ్రప్రదేశ్ దూసుకెళ్తున్న తీరుపై పారిశ్రామిక దిగ్గజాలు ప్రశంసల వర్షం కురిపించారు.ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనికత, ప్రభుత్వ విధానాలు రాష్ట్రంలో పెట్టుబడులకు అనుకూల వాతావరణాన్ని సృష్టించాయని కొనియాడారు. విశాఖపట్నంలో జరుగుతున్న సీఐఐ భాగస్వామ్య సదస్సు వేదికగా పలువురు ప్రముఖ పారిశ్రామికవేత్తలు రాష్ట్రంలో తమ భవిష్యత్ ప్రణాళికలను, భారీ పెట్టుబడుల వివరాలను ప్రకటించారు. కియా, జీఎంఆర్, సాగర్ డిఫెన్స్ వంటి సంస్థల అధినేతలు ఏపీ ప్రభుత్వ పనితీరును ప్రత్యేకంగా అభినందించారు.

రూ. 18 వేల కోట్లతో విస్తరణ.. కియా ఇండియా

కియా ఇండియా సీఈఓ, ఎండీ గ్వాంగ్ లీ మాట్లాడుతూ, ప్రభుత్వ–ప్రైవేటు భాగస్వామ్య విజయానికి ఏపీలోని కియా పరిశ్రమే ప్రత్యక్ష ఉదాహరణ అని అన్నారు. "ముఖ్యమంత్రి చంద్రబాబుపై, ఏపీ ప్రభుత్వంపై ఉన్న పూర్తి భరోసాతోనే మేం భారీ పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చాం. ప్రస్తుతం ఉన్న ప్లాంట్‌ను విస్తరించి, ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుకోవాలని నిర్ణయించాం. ఇందుకోసం రూ. 18 వేల కోట్ల పెట్టుబడులు పెట్టబోతున్నాం. ఈ విస్తరణ ద్వారా ప్రత్యక్షంగా 12 వేల మందికి పైగా ఉద్యోగావకాశాలు లభిస్తాయి" అని ఆయన ప్రకటించారు.

ఏపీ ఆటోమొబైల్ ఎకో సిస్టమ్‌కు కియా అండగా నిలుస్తోంది

ప్రస్తుతం ఏటా 4 లక్షల వాహనాలను ఉత్పత్తి చేస్తూ, ఏపీ ఆటోమొబైల్ ఎకో సిస్టమ్‌కు కియా అండగా నిలుస్తోందని తెలిపారు. ఇక్కడ తయారైన కార్లను 100కు పైగా దేశాలకు ఎగుమతి చేస్తూ, 'మేక్ ఇన్ ఇండియా' ఉత్పత్తులను ప్రపంచానికి అందిస్తున్నామని గర్వంగా చెప్పారు. కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా సుస్థిర ఆంధ్రప్రదేశ్ నిర్మాణంలోనూ భాగస్వాములమవుతామని ఆయన స్పష్టం చేశారు.

ఇది 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'... జీఎంఆర్ గ్రూప్

జీఎంఆర్ గ్రూప్ చైర్మన్ గ్రంధి మల్లికార్జునరావు మాట్లాడుతూ.. ఏపీలో 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' మాత్రమే కాదని, 'స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' నడుస్తోందని ప్రశంసించారు. "ఒక పెట్టుబడిదారుడిగా చెబుతున్నా, ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనికత రాష్ట్రాన్ని వేగంగా అభివృద్ధి పథంలో నడిపిస్తోంది. భోగాపురం విమానాశ్రయం భవిష్యత్తులో ఆంధ్రప్రదేశ్‌కు ఒక ప్రధాన ఆర్థిక చోదక శక్తిగా (ఎకనామిక్ ఇంజన్) మారుతుంది. గతంలో మేం శంషాబాద్ విమానాశ్రయం గురించి ఆలోచించి నిర్మించడం వల్లే, ఇప్పుడు అది తెలంగాణకు ప్రధాన ఆదాయ వనరుగా మారింది. అదే తరహాలో భోగాపురం ఏపీకి కీలకం కానుంది" అని ఆయన వివరించారు. రాష్ట్రంలో ఏరోస్పేస్ రంగంలో పెట్టుబడులను ఆకర్షించేందుకు జీఎంఆర్ గ్రూప్ ఒక ఏరోసిటీని ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు.

ఏపీ నా భాగ్య భూమి...సాగర్ డిఫెన్స్

సాగర్ డిఫెన్స్ సీఈఓ నికుంజ్ పరాశర్ మాట్లాడుతూ.. "మహారాష్ట్ర నా జన్మభూమి అయితే, ఆంధ్రప్రదేశ్ నా భాగ్య భూమి" అంటూ భావోద్వేగంగా ప్రసంగించారు. మారిటైమ్ టెక్నాలజీ రంగంలో ఐదో పారిశ్రామిక విప్లవం రాబోతోందని సీఎం చంద్రబాబు తరచూ చెబుతుంటారని, ఆ సమయం ఇప్పుడు ఆసన్నమైందని అన్నారు. అందుకే ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చామని తెలిపారు. రక్షణ రంగంలో స్థానిక యువతను భాగస్వాములను చేస్తూ 'ఆత్మనిర్భర్ భారత్' లక్ష్యం దిశగా తమ సంస్థ ముందుకు వెళుతోందన్నారు. తీరప్రాంత రక్షకులైన మత్స్యకారుల కోసం ఆధునిక సాంకేతికతను అభివృద్ధి చేయడం ద్వారా సంపద సృష్టించాలనే లక్ష్యంతో పనిచేస్తున్నామని వివరించారు

ట్రస్మా రంగారెడ్డి జిల్లా నూతన కమిటీ నియామకం.. ఆమనగల్లుకు ప్రత్యేక గుర్తింపు

ట్రస్మా రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ గా అవ్వారి నిరంజన్



అవ్వారి నిరంజన్

ఆమనగల్లు, నవంబర్ 12 జర్నలిస్ట్ డైరీ :
రంగారెడ్డి జిల్లా ప్రైవేట్ పాఠశాలల యాజమాన్య సంఘం (ట్రస్మా) నూతన కమిటీ నియామకం జరిగింది. జిల్లాలో ప్రైవేట్ విద్యారంగ అభివృద్ధి, పాఠశాలల యాజమాన్యాలు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం, విద్యా ప్రమాణాల పెంపునకు కృషి చేసే లక్ష్యంతో నూతన కమిటీని ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో ఆమనగల్లు పట్టణానికి చెందిన రిషి టాలెంట్ స్కూల్ నిర్వాహకుడు అవ్వారి నిరంజన్ ట్రస్మా రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీగా కొనసాగుతుండటం విశేషం. విద్యారంగంలో ప్రైవేట్ పాఠశాలల పాత్రను మరింత బలోపేతం చేయడంతో పాటు యాజమాన్యాల సమస్యలను రాష్ట్రస్థాయి దృష్టికి తీసుకెళ్లడంలో ట్రస్మా కీలక పాత్ర పోషిస్తోంది. జిల్లా నూతన కమిటీ ఆధ్వర్యంలో పాఠశాలల అభివృద్ధి, ఉపాధ్యాయుల సంక్షేమం, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం వంటి అంశాలకు ప్రాధాన్యత ఇవ్వాలని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. జిల్లా కమిటీ నియామకంతో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాల్లో నూతన ఉత్సాహం నెలకొంది. ఆమనగల్లు ప్రాంతానికి చెందిన అవ్వారి నిరంజన్ రాష్ట్రస్థాయి బాధ్యతలు నిర్వహిస్తుండటంపై స్థానిక విద్యారంగ ప్రముఖులు, పాఠశాలల నిర్వాహకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. నూతన కమిటీ సభ్యులకు పలువురు శుభాకాంక్షలు తెలియజేశారు.

ఇందిరమ్మ ఇళ్లతో

పేదల ఇంట సంతోషం

నూతన ఇళ్లను ప్రారంభించి, లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి





ఎమ్మెల్యే జనంపల్లి అనిరుద్ రెడ్డి మాట్లాడుతూ

మిడ్జిల్, నవంబర్ 12 జర్నలిస్ట్ డైరీ :
పేదల సొంతింటి కలను సాకారం చేయడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డి అన్నారు. మిడ్జిల్ మండలంలోని వస్పుల, బోయిన్‌పల్లి గ్రామాల్లో నూతనంగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు నూతన స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని, ఇందిరమ్మ ఇళ్ల పథకం పేద కుటుంబాల్లో సొంతింటి సంతోషాన్ని నింపుతోందని పేర్కొన్నారు.

'పవర్ లిఫ్టింగ్' లో సత్తా చాటుతున్న ప్రకాశం యువకుడు

-బీటెక్ చదువుతూ... బరువులు ఎత్తుతున్న శక్తిధర శ్రీచంద్ర..!

-విశేష ప్రతిభతో రాణిస్తున్న చంద్రను ప్రత్యేకంగా అభినందించిన జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు





ఒంగోలు,ప్రకాశం బ్యూరో, జర్నలిస్ట్ డైరీ :
ఆ యువకుడి పేరు..గుంటి శక్తిధర శ్రీచంద్ర. పేరులోనే కాదు... దేహంలోనూ బలమైన శక్తి ఉంది. అధిక బరువులను అవలీలగా ఎత్తుతూ పవర్ లిఫ్టింగులో ఛాంపియనుగా సత్తా చాటుతున్నాడు.రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తూ పతకాలను కైవసం చేసుకుంటున్నాడు. కేవలం 18 ఏళ్ల వయసులోనే వివిధ టోర్నీలలో తన ప్రదర్శనతో ప్రకాశం జిల్లాకు గర్వకారణంగా నిలుస్తున్నాడు. విశేష ప్రతిభతో రాణిస్తున్న చంద్రను జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు ప్రత్యేకంగా అభినందించారు.

బాల్యం నుంచే శక్తి... ఆసక్తి!

శక్తిధర శ్రీచంద్ర ప్రస్తుతం ఒంగోలు శివారులోని పేస్ ఇంజనీరింగ్ కాలేజీలో బిటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. పవర్ లిఫ్టింగ్ చేయడంలో చిన్ననాటి నుంచే ఆసక్తి చూపేవాడు. అతని తల్లిదండ్రులు గుంటి భక్తధృవుడు (హోంగార్డ్), జ్యోతి (అడ్వకేట్) శ్రీచంద్ర పెద్ద కుమారుడు కాగా, చిన్న కుమారుడు నితిన్ చంద్ర ఇంటర్ మొదటి ఏడాది చదువుతున్నాడు. శ్రీచంద్ర శక్తిని, ఆసక్తిని గమనించిన తండ్రి భక్తధృవుడు తగిన శిక్షణ అందించారు. ఈ నేపథ్యంలో ఇటు పవర్ లిఫ్టింగ్ లోనూ, అటు చదువులోనూ రాణిస్తూ శ్రీచంద్ర తనదైన ముద్రను వేస్తున్నారు.

ఇవీ చంద్రకు వచ్చిన మెడల్స్..!

2023 మే నెలలో తెనాలిలో జరిగిన క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ పోటీలలో గోల్డ్ మెడల్.
2024 మార్చిలో చిల్లకల్లులో జరిగిన పవర్ లిఫ్టింగ్ పోటీలలో గోల్డ్ మెడల్.
2024 మే నెలలో మంగళగిరిలో జరిగిన ఎక్విప్డ్ పవర్ లిఫ్టింగులో గోల్డ్ మెడల్.
2024 డిసెంబరులో కృష్ణలంకలో జరిగిన పవర్ లిఫ్టింగులో గోల్డ్ మెడల్.
2025 ఏప్రిల్ లో గుడివాడలో జరిగిన క్లాసిక్ పవర్ లిఫ్టింగులో గోల్డ్ మెడల్.
2025 మే, జూన్ నెలలలో ఒంగోలులో జరిగిన ఎక్విప్డ్ పవర్ లిఫ్టింగ్ బెంచ్ ప్రెస్ పోటీలలో గోల్డ్ మెడల్.
2026 మార్చిలో బెంగళూరులో జరిగిన దక్షిణ భారత పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్షిప్ లో కాంస్య పతకం.
2026 ఏప్రిల్ లో విజయనగరంలో జరిగిన క్లాసిక్ స్టేట్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్షిప్ లో గోల్డ్ మెడల్.
2026 మేలో జగ్గయ్యపేటలో జరిగిన ఎక్విప్డ్ స్టేట్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్షిప్ లో గోల్డ్ మెడల్.
2026 జూన్ లో హైదరాబాద్ లో జరిగిన నేషనల్ ఇండియా పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్షిప్ లో కాంస్య పతకం.
2026 అక్టోబర్, నవంబర్ లో కేరళలో జరిగిన సౌత్ ఇండియా పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్షిప్ లో గోల్డ్ మెడల్.

రేషన్ డీలర్లకు రూ.5 వేల గౌరవ వేతనం, రూ.300 కమిషన్ పెంచాలి

ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డికి వినతిపత్రం అందజేత



మిడ్జిల్, నవంబర్ 12 జర్నలిస్ట్ డైరీ :
రాష్ట్రంలోని 17,200 మంది రేషన్ డీలర్లకు ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు నెలకు రూ.5 వేల గౌరవ వేతనం, రూ.300 కమిషన్ పెంచాలని రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం నాయకులు డిమాండ్ చేశారు. గురువారం జడ్చర్ల ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్ రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. చాలీచాలని కమిషన్‌తో డీలర్లు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, పౌరసరఫరాల శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేయాలని ఎమ్మెల్యేను విజ్ఞప్తి చేశారు. రేషన్ షాపుల ద్వారా మరిన్ని నిత్యావసర సరుకులు పంపిణీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నాయకోటి రాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు ఎన్నం సత్యనారాయణ గుప్తా, కొంగల నాగరాజు, చెన్నారెడ్డి, ఎం.డి. అన్వర్ పాషా, మిడ్జిల్ రేషన్ డీలర్ల సంఘం అధ్యక్షుడు మార్కండేయ గౌడ్, రామాచారి తదితర రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి..

అధికారుల గైర్హాజరుపై ప్రజాప్రతినిధుల అసంతృప్తి

మిడ్జిల్, నవంబర్ 12 జర్నలిస్ట్ డైరీ :
మిడ్జిల్ మండలంలోని పలు గ్రామాల్లో ఇసుక కొరత కారణంగా అభివృద్ధి పనులు ఆశించిన స్థాయిలో ముందుకు సాగడం లేదని ప్రజాప్రతినిధులు ఆవేదన వ్యక్తం చేశారు. అభివృద్ధి పనులకు అవసరమైన ఇసుకను అందుబాటులోకి తీసుకురావాలని, పూర్తయిన పనులకు సంబంధించిన పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని అధికారులను కోరారు. బుధవారం మిడ్జిల్ ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో లక్ష్మణ్ రాథోడ్ అధ్యక్షతన మండల స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. మండల ప్రత్యేకాధికారి విష్ణునందన్, పంచాయతీరాజ్ శాఖ డీఈ జవహర్‌బాబు సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ.. మండలంలోని గ్రామాల్లో అభివృద్ధి పనులకు ఇసుక కొరత ప్రధాన సమస్యగా మారిందని తెలిపారు. ఇసుక రవాణాకు అనువైన ప్రాంతాలను గుర్తించి, అవసరమైన అనుమతులు మంజూరు చేయాలని కోరారు. పంచాయతీరాజ్ శాఖలో ఏఈ లేకపోవడంతో అభివృద్ధి పనుల పర్యవేక్షణలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. ఇప్పటికే పూర్తయిన పనులకు సంబంధించిన బిల్లులు విడుదల కాకపోవడంతో పనులు చేపట్టిన వారు ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వం తక్షణమే బిల్లులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. గ్రామాల్లో వీధి దీపాల నిర్వహణ కోసం ప్రత్యేక వైరును ఏర్పాటు చేయాలని, దెబ్బతిన్న బీటీ రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని సూచించారు. వీబీ జీ రామ్‌జీ పనులకు ప్రతి గ్రామం నుంచి 65 మంది కూలీలు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకుని భవిష్యత్తులో నీటి సమస్యలు తలెత్తకుండా ఇంకుడు గుంతల నిర్మాణం చేపట్టాలని, గ్రామాల్లో అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని సూచించారు.

అధికారుల గైర్హాజరుపై అసహనం

మండల స్థాయి సమీక్షా సమావేశానికి కొందరు అధికారులు హాజరుకాకపోవడంపై ప్రజాప్రతినిధులు అసహనం వ్యక్తం చేశారు. ప్రజా సమస్యల పరిష్కారానికి నిర్వహించే సమావేశాలకు సంబంధిత అధికారులు హాజరుకాకపోవడం సరికాదని అభిప్రాయపడ్డారు. ప్రజాప్రతినిధులు ప్రస్తావించిన సమస్యలను జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని మండల ప్రత్యేకాధికారి విష్ణునందన్ తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీవో రాజశేఖర్‌రెడ్డి, ఎంఈవో వెంకట్రాములు, పలువురు మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

Printed, Published and Owned by SITARALLA SRIRAMULU and Printed at M/s SRI DIVYA PRINTERS, Plot No. 33 & 34, 2nd Floor, Vasthu Colony, LB Nagar, Ranga Reddy, Telangana - 500074 and Published at H.No. 10-1-101/10. Bhagya Nagar Colony, Lingojiguda, Saroornagar, Ranga Reddy, Telangana - 500035. EDITOR: SITARALLA SRIRAMULU , RNI. No. TELTEL/2015/62524. Cell: 9966443465